PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 68 | విజయవాడ, బుధవారం 8 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 8 October 2025 | Rs

చేనేతల సమస్యలపై 18 తీర్మానాలు ఆమోదం

- ముగిసిన ఎపి చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభ
- అధ్యక్ష కార్యదర్శులుగా కామర్తి రాజు, పిల్లలమర్రి బాలకృష్ణ ఎన్నిక

2



ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు రేసులో అభిషేక్, కుల్దీప్, మంధాన

8

దేశ భద్రత పణం!

రూ. 80 కోట్ల కోసం అదాని గ్రూపు కక్కుర్తి

- క్షిపణి భాగాల లెక్కల్లో గోల్‌మాల్
- డిఆర్‌ఐ విచారణలో వెలుగులోకి
- రాయిటర్స్ వెల్లడి!



న్యూఢిల్లీ : సొంత లాభాల కోసం అదాని గ్రూపు దేశ భద్రతను సైతం పణంగా పెడుతోందా? ఈదిశలో ఇప్పటికే చర్చనీయాంశమైన అనేక విషయాలకు తోడు తాజాగా మరో అంశం వెలుగులోకి వచ్చింది. 80 కోట్ల రూపాయల కోసం కక్కుర్తి పడిన అదాని గ్రూపు దేశ రక్షణకు సంబంధించిన లెక్కల్లోనూ గోల్‌మాల్‌కు పాల్పడటమే ఈ అనుమానాలు కారణం. నిజానికి అదానికి ఆర్థిక సామ్రాజ్యపు లక్షల కోట్ల రూపాయల విలువతో పోలిస్తే 80 కోట్ల రూపాయలు ఏ మూలకు రావన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ, ఆ మొత్తం కోసం దేశ భద్రతకు అత్యంత కీలకమైన క్షిపణి భాగాల లెక్కల్లో సైతం అదాని గ్రూపు గోల్‌మాల్‌కు పాల్పడిందంటూ 'రాయిటర్స్' తాజాగా ప్రచురించడం చర్చనీయాంశంగా మారింది. భారత డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్‌ఐ) దృష్టికి ఈ వ్యవహారం రావడంతో ఆ సంస్థ నిర్వహించిన విచారణలో ఈ విషయం తేలినట్లు రాయిటర్స్ పేర్కొంది. ఆ కథనం ప్రకారం ప్రముఖ పారిశ్రామికవేత్త, అపార కుబేరుడు గౌతం అదానీకి చెందిన అదాని డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ క్షిపణి భాగాలపై 9 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.80 కోట్లు) సుంకాలు ఎగవేసినట్లు డిఆర్‌ఐ దృష్టికి వచ్చింది. ఈ ఆరోపణలపైన 2025 మార్చిలో ఈ దర్యాప్తు ప్రారంభించినట్లు ఇద్దరు అధికారులు ధృవీకరించినట్లు ఆ సంస్థ ఈ కథనంలో పేర్కొంది. షార్ట్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి భాగాలను లాంగ్ రేంజ్ క్షిపణి భాగాలుగా తప్పుగా చూపించడం ద్వారా సుంకం ఎగవేసిందన్నది అదాని సంస్థపై ప్రధాన అరోపణ. లాంగ్ రేంజ్ క్షిపణి భాగాలకు దిగుమతి సుంకం నుండి మినహాయింపు ఉండటంతో అదానీ డిఫెన్స్ ఈ మోసానికి పాల్పడింది. షార్ట్ రేంజ్ భాగాలపై 10 శాతం దిగుమతి సుంకం, 18 శాతం స్థానిక పన్ను అమల్లో ఉన్నాయి. ఈ తప్పుడు వర్గీకరణ వల్ల అదానీ డిఫెన్స్ ఈ పన్నులను తప్పించుకుందని అధికారులు పేర్కొన్నారు. అదానీ డిఫెన్స్ భారత భద్రతా దళాల కోసం డ్రోన్లు, క్షిపణులు, చిన్న ఆయుధాలను సరఫరా చేస్తోంది. వాటికి సంబంధించిన లెక్కల్లోనే ఈగోల్‌మాల్‌కు పాల్పడింది. డిఆర్‌ఐ దర్యాప్తు సమయంలో అదానీ ఎగ్జిక్యూటివ్‌లు తప్పుడు వర్గీకరణను అంగీకరించినట్లు ఒక అధికారి తెలిపారని రాయటర్స్ పేర్కొంది. ఇటువంటి కేసుల్లో, కంపెనీలు చెల్లించని సుంకంతో పాటు 100 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆ జరిమానా మొత్తం కూడా అదాని సంస్థకు పెద్ద లెక్కేమి కాదన్న విషయం తెలిసిందే. అయితే, డిఆర్‌ఐ కస్టమ్స్ నిబంధనలపై స్పష్టీకరణ కోరామని అదానీ డిఫెన్స్ పేర్కొంది. తాము అవసరమైన పత్రాలను సమర్పించామని, తమ వైపు నుండి ఈ సమస్య పరిష్కారమయ్యిందని తెలిపింది. అయితే సమస్య పరిష్కారం కోసం చెల్లింపులు మిగతా 7లో

సమస్యల పరిష్కారం కోసం

కదం తొక్కిన ఉపాధ్యాయులు

బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటన

12వ పిఆర్‌సి, తాత్కాలికంగా 30శాతం ఐఆర్ కోసం ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కరించాలని, బోధనేతర యాప్‌లు రద్దు చేయాని డిమాండ్ చేస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం కదం తొక్కారు. ఫ్యాప్టో పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు 'పోరుబాట' కార్యక్రమానికి తరలిరావడంతో ధర్నా చౌక్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయ్యాయి. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉపాధ్యాయులు ధర్నాచౌక్‌కు చేరుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ బోధనేతర పనులతో పాటు విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్ సాయి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. 12వ పిఆర్‌సిని ప్రకటించాలని, ఈలోగా మధ్యంతర భృతి30శాతం ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలని ఈ సభ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ కూటమినేతలు ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి ప్రకటన ఇప్పటికే ఆలస్యమైందని తక్షణమే పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళాలన్నారుగత ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడంతో పాటు మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారన్నారు. ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ ఫ్యాప్టో చేపట్టే ఆందోళనకు ఎపిజెఎసి, ఎపి ఎన్‌జిఓస్



విజయవాడ ధర్నా చౌక్‌లో 'పోరుబాట' సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

అసోసియేషన్ పక్షాన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. గత ప్రభుత్వంతో ఉద్యోగ వర్గాలు అన్ని రకాలుగా నష్టపోయారని, కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు ,ఉపాధ్యాయులకు మెరుగైన పరిస్థితి ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్‌సి కమిషన్ అపాయింట్‌మెంట్ చేయాలని, పెండింగ్ లోని 4 డిఎలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈనెల 20 తర్వాత ఎపిజెఎసి రాష్ట్ర వ్యాప్త సమావేశం ఏర్పాటుచేయబోతున్నట్లు విద్యాసాగర్ తెలిపారు. సిపిఎస్ రద్దు,ఓపిఎస్ పునరుద్దరణకు చేసే ఏ పోరాటానికైనా తాముసిద్ధమన్నారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ గతంలో జిల్లా కలెక్టర్లు ఖాళీగా ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీలు నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. డిఎలు అనేక పోరాటాలతో సాధించుకున్నవని, ప్రభుత్వం డిఎలు విడుదల చేయకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ ఎస్ చిరంజీవి మాట్లాడుతూ మండల పరిషత్, జిల్లా పరిషత్తుల్లో పనిచేస్తూ చనిపోయిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్యాని యామకాలను వెంటనే చేపట్టాలన్నారు. 1998 డిఎస్‌సిలో మిగిలిన పోయిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలని, 1998,2008 డిఎస్‌సివారిని రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ , యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే మరో బిఆర్‌టిఎస్ రోడ్డు ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. సిఆర్‌పి(సిఆర్‌ఎంటి) వేతనాలను పెంచాలని, పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఈలోగా మధ్యంతర భృతి 30శాతం ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాప్టో చేపట్టే ఎటువంటి పోరాటానికైనా తమ మద్దతు ఉంటుందన్నారు. ఇహెచ్‌ఎస్, మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లుల విషయంలో ఉత్పన్నమవు తున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రిటైర్ అయిన వారికి గ్రాట్యూటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పోరుబాట ధర్నాలో ఫ్యాప్టో నేతలు కె.నరహరి, బి.మనోజ్‌కుమార్, చందోలు వెంకటేశ్వర్లు, కె.ప్రకాష్‌రావు, కె.భానుమూర్తి, గుత్తా శ్రీనివాసరావు, చింతల సుబ్బారావు, సయ్యద్ ఇక్బాల్, డిమధుసూధనరావు, ఎం ప్రవీణ్‌కిరణ్, హృదయరాజు ,సిపిఎస్ ఉద్యోగ సంఘం నాయకులు సిఎం దాస్, సతీష్, బాజీపఠాన్ ,ఎపిసిపిఎస్‌ఇఎ నాయకులు బాజ్జీ, ఎపి ఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి డివి రమణ ప్రసంగించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు ఎవి నాగేశ్వరరావు, శీలం వెంకట సుబ్బయ్య, కిషోర్‌బాబు ఫ్యాప్టో పోరాటాలకు మద్దతు ప్రకటించారు.

మోడీ పర్యటనకు

15న కర్నూలులో నిరసన

వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనకు ఈ నెల 15వ తేది కర్నూలులో నిరసన తెలపాలని వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధక్షతన మంగళవారం జరిగిన వామపక్ష పార్టీల సమావేశం నిర్ణయింయింది, జిఎస్‌టి విజయోత్సవం పేరుతో ఈ నెల 16వ తేదిన కర్నూలుకు ప్రధానమంత్రి వస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాని పర్యటనకు ఒక్కరోజు ముందే 15వ తేదిన ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలియ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు ఉదయ్‌కిరణ్, కల్యాణకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమెక్రసీ నాయకులు మేకల ప్రసాదు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు ఖాదర్‌భాషా, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. హాజరుకాలేకపోయిన ఎస్‌యుసిఐసి, ఆర్‌ఎస్‌పి, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు సమావేశంలో తీసుకునే నిర్ణయాలక మద్దతు ప్రకటించారు. సామాన్య ప్రజల నిత్యావసర వస్తువుల ధరలపై జిఎస్‌టి తగ్గింపు ప్రభావం పెద్దగా లేకపోయినా ప్రజలకు ఎంతో మేలు చేసినట్లు కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సభలు జరపడం హాస్యాస్పదమని ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వామపక్షాలు పేర్కొన్నాయి. జిఎస్‌టి ప్రభావంతో రాష్ట్రానికి 8వేల కోట్ల రూపాయలు నష్టం వస్తుందని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రకటించినవ విషాయాన్ని ఆ పార్టీలు గుర్తు చేశాయి. ఆ నష్టాన్ని పూడ్చే పద్ధతిలో కేంద్రం స్పందించాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రధానమంత్రిని కోరాలని ఆ పార్టీలు డిమాండ్ చేశాయి. అలాగే రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటనలు చేసినా కడపస్టీలు ఫ్యాక్టరీ ఒక్కఅడుగు కూడా ముందుకు పడలేదని, వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించే నిధులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని, విభజన చట్టంలోని హామీలేవీ అమలుకు నోచలేదని తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలను కేంద్ర ప్రభుత్వం తీవ్రం చేసిందని పేర్కొన్నారు.

సిజెఐపై దాడికి ఖండన

సమావేశంలో భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై మతోన్మాదులు దాడిచేయడానికి ప్రయత్నించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. ఇది రాజ్యాంగంపైనే దాడి సమావేశం అభిప్రాయపడింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఆయుధడిపోను ప్రజలకు నష్టం లేకుండా వేరే ప్రాంతంలో నిర్మించాలని జరుగుతున్న ఆందోళనలకు సమావేశం మద్దతు ప్రకటించింది. త్వరలో వామపక్ష పార్టీల తరుపున ఆ ప్రాంతాన్ని సందర్శించాలని నిర్ణయించింది. ఇటీవల శాసనసభలో కార్మికుల పనిగంటలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేసింది.

9కి చేర్పులు, తొలగింపుల వివరాలివ్వండి

- బీహార్‌లో సర్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

7

మెడికల్ ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కోటి సంతకాల సేకరణ

2

భౌతిక శాస్త్రంలో

ముగ్గురికి నోబెల్

కొత్తతరం కంప్యూటర్లకు ఊతమిచ్చే ఆవిష్కరణలు

స్టాక్‌హోం : ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి లభించింది. అనేక కణాలతో కూడిన క్వాంటమ్ టన్నెలింగ్‌ను మాక్రోస్కోపిక్ స్కేలుపై ఎలా పరిశీలించవచ్చు అనే అంశంపై జాన్ క్లార్క్, మైఖేల్ డివొరెట్, జాన్ మార్టినిస్ సాగించిన పరిశోధనకు గానూ ఈ పురస్కారం లభించింది. 'ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటమ్ మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌లో ఆవిష్కరణలకు గానూ ఈ పురస్కారం అందజేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. శతాబ్ద కాలం నాటి క్వాంటమ్ మెకానిక్స్‌లో ఇంకా కొత్తగా ఆశ్చర్యచకితులను చేసే అంశాలను కనుగొనడం అద్భుతమైన విషయమని పేర్కొంది. డిజిటల్ సాంకేతికతకు క్వాంటమ్ మెకానిక్స్ పునాది అయినందున దీనివల్ల అపారమైన ఉపయోగాలు వున్నాయని భౌతిక శాస్త్రంలో నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓలె ఎరిక్సన్ పేర్కొన్నారు. కంప్యూటర్ మైక్రోచిప్స్ లోని ట్రాన్సిస్టర్లు క్వాంటమ్ టెక్నాలజీకి ఒక ఉదాహరణ. మొబైల్ ఫోన్లు, కెమెరాల నుండి ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ వరకు ఈనాడు మనం



జాన్ క్లార్క్, మైఖేల్ డివొరెట్, జాన్ మార్టినిస్

ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో క్వాంటమ్ మెకానిక్స్ ఆధారం లేకుండా ఏదీ వుండదని నోబెల్ కమిటీ తెలిపింది. ఈ ఏడాది కనుగొన్న కొత్త ఆవిష్కరణ క్వాంటమ్ కంప్యూటర్లు, క్వాంటమ్ సెన్సార్లు వంటి కొత్త తరం క్వాంటమ్ టెక్నాలజీ వృద్ధి చెందడానికి అవకాశాలు కల్పిస్తోందని నోబెల్ కమిటీ మీడియా ప్రకటనలో పేర్కొంది.

బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యం విభాగంలో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతితోపాటు ఈ నెల 13న ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను వెల్లడిస్తారు.

పిడుగుపాటుకు ముగ్గురు వలస కార్మికులు మృతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి (శ్రీకాకుళం)

పిడుగుపాటుకు ముగ్గురు వలస కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. మృతుల్లో మెళియాపుట్టి మండలం గంగరాజపురంలోని రాజయోగి క్వారీలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికులు శ్రావణ్‌కుమార్ (45), రాజస్థాన్‌కు చెందిన హేమరాజు (25), మధ్యప్రదేశ్‌కు చెందిన పింటు (25) ఉన్నారు. మరో నలుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికుల కథనం మేరకు... మంగళవారం సాయంత్రం క్వారీలో పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులను టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వీరిలో మెళియాపుట్టి మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన బైపోతు హరిప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కార్మికుల మృతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కార్పొరేట్ల చేతిలో

రూ.25 వేల కోట్ల విలువైన భూములు!

- సెజ్‌లు, పరిశ్రమల ఏర్పాటు పేరుతో ఉమ్మడి నెల్లూరులో 60 వేల ఎకరాల భూసేకరణ
- నిరుపయోగంగా 50 వేల ఎకరాలు
- రూ.10 వేల కోట్ల పంట దూరం...



ముత్తుకూరు వద్ద ఖాళీగా ఉన్న భూములు

సంస్థలు	కట్టబెట్టిన భూమి (ఎకరాల్లో)
థర్మల్ ప్రాజెక్టులు	33,000
కృష్ణపట్నం సెజ్	6,000
శ్రీసిటి సెజ్	5,700
మేనకూరు సెజ్	5,600
కిసాన్‌సెజ్	2,770
చింతవరం సెజ్	2,700
మాంబట్టు	1,000
మీదానీ	500
ఎన్ఐఐటి	500

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

పరిశ్రమల ఏర్పాటు, యువతకు లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి కల్పన పేరుతో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌ల) కోసం తీసుకున్న భూములు నిరుపయోగంగా ఉన్నాయి. 2004 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు సెజ్‌ల ఏర్పాటు పేరుతో సుమారు 60 వేల ఎకరాల భూములను ప్రభుత్వాలు రైతుల నుంచి బలవంతంగా లాక్కున్నాయి. ఇందులో అత్యధిక భాగం పంట పొలాలే. ఇప్పటి వరకు పది వేల ఎకరాల్లో మాత్రమే పరిశ్రమలు వచ్చాయి. దాదాపు 50 వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. 18 సంవత్సరాల నుంచి ఈ భూములు బీడుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ భూములకు ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ధర ఉంది. ఎకరా రూ.50 లక్షల లెక్కించినా కార్పొరేట్ల గుప్పిట్లో సుమారు రూ.25 వేల కోట్ల విలువైన భూములు చిక్కుకున్నాయి. సారవంతమైన ఈ భూముల్లో పంటలు పండిస్తే సుమారు 54 లక్షల పుట్లు (ఒక పుట్టికి 850 కిలోలు) దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఉన్న ధరల లెక్కల ప్రకారం సుమారు రూ.10 వేల కోట్లు ధాన్యం దిగుబడి లభించేది.

2004లో మాంబట్టు, మేనకూరు, తడ, శ్రీసిటి, చింతవరం, కృష్ణపట్నం, రేగడచెలిక ప్రాంతాల్లో సెజ్‌లు ఏర్పాటయ్యాయి. ఇక్కడ పరిశ్రమలు వచ్చి ఉంటే జిల్లా పరిస్థితి మరోలా ఉండేది. మేనకూరు, తడ, శ్రీసిటి, చింతవరం... తిరుపతి జిల్లాలో కలిసిపోయాయి. కృష్ణపట్నం పోర్టు, మిగిలిన సెజ్‌లు నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాలో 180 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. జాతీయ రహదారిని, కృష్ణపట్నం పోర్టును చూపి ప్రభుత్వం 18 సంవత్సరాల నుంచి జిల్లా యువతను మురిపిస్తూ వచ్చింది. కృష్ణపట్నం పోర్టు అదాని చేతికి వెళ్లాక ఇటీవల సుమారు 15 వేల మంది కార్మికులకు, ఉద్యోగాలకు ఉపాధి పోయింది. ఇప్పుడు రామాయపట్నం పోర్టు పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోంది. 2006లో థర్మల్ పవర్ ప్రాజెక్టుల పేరుతో 33 వేల ఎకరాలు భూములను రైతుల నుంచి, సాగుదారుల నుంచి బలవంతంగా లాక్కున్నారు. ఈ ప్రాజెక్టులు రాకపోగా, భూములను కొందరు పారిశ్రామికవేత్తలు బ్యాంకుల్లో కుదవ పెట్టి రుణాలు తీసుకున్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూములతో రిలయన్స్ కంపెనీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ప్రయత్నాలు మిగతా 7లో



విజయనగరంలో ఊరేగుతున్న సిరిమాను (ఇన్‌సెట్‌లో పూజారి బంటుపల్లి, పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి ఆనం)

వైభవంగా 'పైడితల్లి' సిరిమానోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి రాంనారాయణరెడ్డి
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన విజయనగరం పైడితల్లమ్మ వారి సిరిమానోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ ఉత్సవం వర్షం కారణంగా ఆలస్యంగా 4.15 గంటలకు ప్రారంభమైంది. అమ్మవారికి ప్రతిరూపంగా భావించే పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. సిరిమానుకు ముందు భాగంలో సంప్రదాయంగా పాలధార, అంజలి రథం, తెల్ల ఏనుగు, జాలరి వల సాగాయి. సిరిమాను అమ్మవారి ఆలయం నుంచి కోట గుమ్మం వరకు మూడుసార్లు ఊరేగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలలతోపాటు రాష్ట్రంలోని వివిధ మిగతా 7లో

నెల్లూరులో ఇద్దరి హత్య

ప్రజాశక్తి- నెల్లూరు

నెల్లూరు నగరంలో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరిని హత్య చేసి మృతదేహాలను తిక్కన పార్కు సమీపంగల పెన్నా నదిలో కాలువలో పడేశారు. కర్రలతో వారి తలపై అత్యంత దారుణంగా కొట్టి హత్య చేశారు. మంగళవారం స్థానికులు కొందరు వీటిలో ఒక మృతదేహాన్ని చూసి సంతపేట పోలీసులకు తెలియజేశారు. సిఐ దశరథరామయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాలువలోని మృతదేహాన్ని భారీ క్రేన్ సహాయంతో వెలికి తీయించారు. అనంతరం హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తరుణంలో మరో మృతదేహం కాలువకు మరో వైపు పడి ఉండడాన్ని గుర్తించారు. దీనినీ వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం రెండు మృతదేహాలనూ నెల్లూరు జిజిహెచ్‌కి తరలించారు. పోలీసుల విచారణలో ఇవి పోలయ్య (55), శివ (25) మృతదేహాలుగా తేలింది. వీరు ఏ ప్రాంతానికి చెందిన వారో, ఏమి చేస్తుంటారో నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని నెల్లూరు నగర డిఎస్‌పి పి.సింధుప్రియ పరిశీలించారు. క్లూస్ టీం ఈ ప్రాంతంలో కొన్ని ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజధాని రైతుల ఫిర్యాదుపై స్పందించిన బ్యాంక్

- నేడు భూముల సర్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో తాము భూసమీకరణ (పూలింగ్)కు ఇవ్వకపోయినా సిఆర్‌డిఎ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారంటూ కొందరు రైతులు చేసిన ఫిర్యాదుపై వరల్డ్ బ్యాంకు స్పందించింది. సదరు రైతుల భూములను బుధవారం (నేడు) సర్వే చేయనున్నారు. విజయవాడకు చెందిన పసుపులేటి జమలయ్య, కలపాల శరత్‌కుమార్.. మందడంలో ఉన్న తమ భూములను బలవంతంగా లాక్కుంటున్నారంటూ ప్రపంచబ్యాంకు ఫిర్యాదు చేశారు. తమను బెదిరించి కంచెలు సైతం తొలగించారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదని, చివరకు ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. రైతుల ఫిర్యాదును పరిశీలించిన ప్రపంచబ్యాంకు బృందం వెంటనే ఆ భూముల వివరాలను పరిశీలించాలని, ప్రాజెక్టు పర్యవేక్షణ తమ పరిధిలో ఉన్న నేపథ్యంలో సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించింది. దీంతో సిఆర్‌డిఎ, రెవెన్యూ అధికారులు నేడు సర్వే నిర్వహించనున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సమర్ధవంతమైన నేతకే పార్టీ అధ్యక్ష బాధ్యతలు

- తెలంగాణ టిడిపి నేతలకు చంద్రబాబు స్పష్టీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఇచ్చే వారికే తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ టిడిపి నేతలు సిఎం చంద్రబాబునాయుడుతో సుదీర్ఘకాలం తర్వాత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇప్పటికే కసరత్తు పూర్తయిన మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తి చేసి నాయకత్వాన్ని అందిస్తే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీలో యాక్టివ్‌గా పనిచేయడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉన్నారని వారు చంద్రబాబుకు తెలిపారు. తెలంగాణలో ఇప్పటి వరకు 1.78లక్షల సభ్యత్వం చేసినట్లు పార్టీ అధ్యక్షునికి వివరించారు. రాష్ట్ర అధ్యక్షునితో పాటు స్టేట్ కమిటీ నియమించాలనే అంశంపై ప్రధానంగా చర్చజరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన విధానంపై చర్చ జరిగింది.

తెలంగాణ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుని నియామకం ప్రక్రియ ఆలస్యమయ్యే పక్షంలో తాత్కాలికంగా ముఖ్యనాయకులతో కలిపి రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. అందరి అభిప్రాయాలను తీసుకుని పార్టీ యాక్టివిటీ పెంచాలని చంద్రబాబు తెలంగాణ టిడిపి నేతలకు సూచించారు. చంద్రబాబును కలిసిన వారిలో రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్‌రావు, అరవింద్‌కుమార్ గౌడ్, నర్సిరెడ్డి, నందమూరి సుహాసినితో పాటు పలువురు నేతలు ఉన్నారు.

16న ప్రధాని పర్యటనలో నల్లబ్యాడ్జీలతో నిరసన

- ఆదివాసీ గిరిజన సంఘం రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజి హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఈ నెల 15వ తేదీలోపు ఉపసంహరించుకోని పక్షంలో 16వ తేదీన ప్రధాన మంత్రి పర్యటనలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని ఆదివాసీ గిరిజన సంఘం రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆదివాసీల అనుమతి లేకుండా అడవులు, భూములపై డ్రోన్ల సర్వేలు చేస్తూ సర్వే రాళ్లను పాతుతున్న అదానీ, నవయుగ సంస్థల ప్రతినిధులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన అటవీ, పర్యావరణ అనుమతులు వెంటనే రద్దు చేయాలని, పోడు, బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ తీర్మానాలు ఈ సమావేశంలో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విజయనగరం జిల్లల్లో గిరిజన భూములను నిభందనలకు విరుద్ధంగా హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమన్నారు. గ్రామ సభలు, ప్రజల అనుమతి లేకుండా నవయుగా, అదానీ, షిర్డి సాయి వంటి సంస్థలు డ్రోన్లతో సర్వే నిర్వహించి, రాళ్ళు పాతడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. 30 పంచాయతీల పరిధిలోని 250 గ్రామాలకు సంబంధించిన 50 వేల మంది వరకూ ప్రజలు ఈ పవర్ ప్రాజెక్టుల వల్ల సర్వస్వం కోల్పోతున్నారని తెలిపారు. అక్కడ కాఫీ, మిరియాలు వంటి విలువైన పంటలు పండే సారవంతమైన భూములని చెప్పారు. ప్రతి వేదికపైన అరకు కాఫీ గురించి ప్రస్తావించే చంద్రబాబు ఈ అరకు కాఫీ పంటకు ఇబ్బందులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ గ్రీన్ ఎనర్జీ అసోసియేషన్ కూడా ప్రజలను ఇబ్బంది పెట్ట కుండా, పంట పొలాలు తీసుకోకుండా, నదులు, ఇతర అనుకూలమైన ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని సూచించినట్లు చెప్పారు. పవర్ ప్లాంట్లు గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వెనుక విద్యుత్ ఒక్కటే కాదు, ఇక్కడున్న సహజవనరులను దోచుకోవడమే లక్ష్యమన్నారు. పవర్ ప్లాంట్లను వ్యతిరేకిస్తూ వేలాదిగా గిరిజనలు పోరాబాట పట్టారన్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటును తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించిందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 2, 13, 51, రద్దు చేయాలని, ఆయా సంస్థలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

గిరిజనుల ఉనికిని కాపాడాలని లేకుంటే ప్రతిఘటన చాలా తీవ్రంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వజన మాట్లాడుతూ.. గిరిజనులకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల గిరిజనులు ఉనికినే కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల వేలాది గిరిజన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొబోతున్నాయని తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ.. షెడ్యూల్ 5, 1/70, పీసా చట్టాలు అమల్లో ఉన్నా వాటిని ఉల్లంఘించి గిరిజన ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. బాక్సైట్ తవ్వకాలను అడ్డుకునేందుకు 20 ఏళ్ల కిందట పోరాటం చేసి అడ్డుకున్నామని, ఇప్పుడూ అదేవిధంగా పవర్ ప్రాజెక్టులను అడ్డుకుంటామన్నారు. పాలకులు అంతా కలిసి ఏజన్సీ ప్రాంతాన్ని అమ్మేసేఎందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ సమావేశానికి గిరిజన సంఘం సహాయ కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అప్పల నరసయ్య, గిరిజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, వైసిపి నాయకులు రమేష్, గిరిజన ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్, కన్వీనర్ బాలజీ, ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, ఏకలవ్య ట్రైబర్ యూనియన్ నాయకులు దేవరకొండ విజయ్ కుమార్, ఐద్వా నాయకురాలు శ్రీదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, సిఐటియు రాష్ట్ర నాయకురాలు రమాదేవి, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి శిష్టా, జెవివి రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, హైడ్రో పవన్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సురేష్, ప్రభాకర్, శ్రీకృష్ణ, మజ్జి కృష్ణంరాజు తదితరులు ప్రసంగించారు.

మెడికల్ ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కోటి సంతకాల సేకరణ
- గ్రామ, వార్డుస్థాయిలో రచ్చబండ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌ఛార్జులతో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలల అంశంపై కోటి సంతకాలు సేకరించనున్నట్లు తెలిపారు. గ్రామవార్డు స్థాయిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని, అక్టోబరు 10 నుండి నవంబరు 22 వరకు ర్యాలీలు, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నవంబరు 23న నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రాలకు, 24న విజయవాడకు తరలిస్తామని తెలిపారు. వాటిని గవర్నర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణమని తెలిపారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన మొత్తం ఏడు కళాశాలలు, వివిధ దశల్లో ఉన్న 10 మెడికల్ కళాశాలలు రూ.1000 కోట్లు ఖర్చు పెడితే అన్నీ అందుబాటులోకి వచ్చేవని వివరించారు. అయినా కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదన్నారు. అవి ప్రజల సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టిడిపి కూటమి పాలనపై ప్రజల్లో భ్రమలు తొలిగాయని, అన్ని రంగాల్లో విఫలమైన టిడిపి కూటమి ప్రభుత్వం హయంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని వివరించారు. ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడీ, ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందని వివరించారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగన్

జగన్‌ను కలిసిన మత్స్యకారులు

శ్రీలంక ప్రభుత్వం అదుపులో ఉండి విడుదలైన కాకినాడకు చెందని మత్స్యకారులు మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో జగన్‌ను కలిశారు. తమను శ్రీలంక ప్రభుత్వం అరెస్టు చేసిందని, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో విడుదలయ్యామని వారు తెలిపారు.

చేనేతల సమస్యలపై 18 తీర్మానాలు ఆమోదం

- ముగిసిన ఎపి చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభ
- అధ్యక్ష కార్యదర్శులుగా కామర్తి రాజు, పిల్లలమర్రి బాలకృష్ణ ఎన్నిక



నూతన రాష్ట్ర కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లి పట్టణంలో రెండ్రోజుల పాటు జరిగిన ఎపి చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. అధ్యక్ష కార్యదర్శులుగా కామర్తి రాజు, పిల్లలమర్రి బాలకృష్ణ ఎన్నికయ్యారు. స్థానిక పోలా రామాంజనేయులు నగర్, జెఎన్ శేషయ్య ప్రాంగణం (పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం)లో రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా కట్టా శివ దుర్గారావు, నందం చంద్రకళ, కామర్తి రాజు వ్యవహరించగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి సౌహార్ద సందేశమిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించిన మహాసభ 18 తీర్మానాలను ఆమోదించింది. నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని, ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం జిఓ చేయాలని కోరుతూ తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది. చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు జిఓ వెంటనే అమలు చేయాలని, పట్టు, నూలు ధరలు 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, చేనేత వస్త్రాలపై 20 శాతం రిబేటును కొనసాగించాలని, జీవిత, ఆరోగ్య బీమా సదుపాయాన్ని పునరుద్ధరించి, వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని మహాసభ కోరింది. తెలంగాణ రాష్ట్రం మాదిరి చేనేత కార్మికులకు రూ. ఐదు లక్షల స్కీమును ప్రవేశపెట్టాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేసి, పనిచేస్తున్న సంఘాలను ప్రోత్సహించాలని, సహకార సంఘాలకు యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేట్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంగా చేనేత వస్త్రాలు ఇవ్వాలని, పార్కులు ఏర్పాటు చేయాలని, చేనేత కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి, పక్కా ఇల్లు నిర్మించాలని, చైనా నుండి పట్టు రేషన్ దిగుమతి చేసుకొని సబ్సిడీపై పట్టు కార్మికులకు అందించాలని, ప్రైవేటు రంగంలోని చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ అమలు చేయాలని, కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. ఈ అంశాల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమకార్యాచరణ ప్రణాళికను మహాసభ రూపొందించింది.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కామర్తి రాజు. ఉపాధ్యక్షులు కట్టా శివ దుర్గారావు, ఎం సత్యనారాయణ. కార్యదర్శిగా పిల్లలమర్రి బాలకృష్ణ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శుగా డోకిపర్తి రామారావు, వాసా గంగాధరరావు. నందన్ చంద్రకళ. సభ్యులుగా భరణి కాళ్లప్ప, కనికేలా లక్ష్మన్న, అనుముల వీరబ్రహ్మం, సాధు నరసింహారావు. చల్లా సీతారామాంజనేయులు, కొండేటి కుమారి, గోరు రాజు, బూడిద జోగేశ్వరరావు, చల్లా వీరభద్రుడు, గద్దె హేమసుందర రావు, దీపాల సత్యనారాయణతోపాటు మరొకర్ని రాష్ట్ర కమిటీకి మహాసభ ఎన్నుకుంది.

ఎక్సైజ్ సిఐ హిమబిందుపై బదిలీ వేటు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్



నకిలీ మద్యం తయారీని గుర్తించడంలో అలసత్వం వహించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హిమబిందుపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ఆమెను తక్షణమే విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సిఐ కిషోర్‌కుమార్‌కు ములకలచెరువు ఎక్సైజ్ సిఐగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. రెండు రోజుల క్రితం ములకలచెరువు మండలంలో నకిలీ మద్యం తయారీ స్థావరాన్ని గుట్టు రట్టు చేసి పది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ విద్యార్థిని దారుణహత్యకు గురైన సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగింది. కాగా నిందితుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేశాడన్న అనుమానాలు ఉన్నాయని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని అన్నారెడ్డి గూడెంకు చెందిన ఇందు (17) నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. గుట్టకింద అన్నారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణగౌడ్‌తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరు ఆరు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో బాలికను మంగళవారం కృష్ణగౌడ్ తన మిత్రుడు (ఓ ఆటోడ్రైవర్) రూమ్‌కు తీసుకెళ్లాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగగా గడ్డం కృష్ణ విద్యార్థినిని హత్య చేసి డైట్ కళాశాల సమీపంలో పడేశాడు. కాగా తల్లిదండ్రులు మాత్రం తమబిడ్డపై లైంగికదాడి చేసి హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గడ్డం కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలాన్ని నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, వన్‌టౌన్ సిఐ వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

జనగణనలో కులగణన నిర్వహించండి : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్ల అమలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కుల గణన నిర్వహించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఇతర పలు పార్టీలు, బిసి సంఘాల నాయకులతో కలిసి రామకృష్ణ గవర్నర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలోను జనగణనలో కులగణన చేపట్టాలని, ఆ వివరాల ఆధారంగా స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరినట్లు తెలిపారు. విద్యా, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికిగాను తెలంగాణ తరహాలో బిసిలకు దామాషా రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి బిల్లును పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పిసిసి ఉపాధ్యక్షులు కొనుకొండ శివాజి, బిసి సంఘాల నాయకులు ఆలా వెంకటేశ్వర్లు, జి.యలమందరావు, కుమ్మర కృష్ణకుమార్, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్జెడి నాయకులు ఆర్ఎస్ యాదవ్ ఉన్నారు.

సిజెఐపై దాడి హేయం

- దళిత, గిరిజన, మైనార్టీ ఐక్య సంఘాల నిరసనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సనాతన ధర్మం పేరిట సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై చేసిన దాడి హేయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. దళిత, గిరిజన, మైనార్టీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బందరురోడ్డులోని అంబేద్కర్ స్మృతివనం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ గవాయ్‌పై జరిగిన దాడి కేవలం న్యాయవ్యవస్థపైనే కాదని, మొత్తం జాతిపైన చేసిన దాడని అన్నారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రజానీకం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సనాతన ధర్మం ఎలా ఉంటుందో ఈ ఘటనతో దేశం మొత్తానికి ఒక హెచ్చరిక లాంటిదని పేర్కొన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి మనువాద, మతోన్మాద దాడులతో మొత్తం వ్యవస్థలనే ధ్వంసం చేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఘటనను ఖండించినప్పటికీ మతోన్మాదాన్ని వారు నెత్తిన పెట్టుకోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన అలుసే ఈ ఘటన జరగడానికి ప్రధాన కారణమన్నారు. మనువాద భావజాలాన్ని అన్ని రంగాలకూ విస్తరించిన నేపథ్యంలో ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే అధికారం పోతుందనే స్థాయిలో వారికి బుద్ధిచెప్పేలా ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే కేంద్రం సరిగా స్పందించలేదని, ప్రకటనతో సరిపుచ్చుకుందని విమర్శించారు. దీన్ని మొత్తం సమాజంపై దాడిగా చూడాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ నిరంతరం సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్న రాష్ట్రంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు దాని ప్రమాదాన్ని గుర్తించాలని అన్నారు. మొత్తం వ్యవస్థలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దడాల సుబ్బారావు, సిపిఐ నాయకులు బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

ఆయుధ డిపో నిర్మించొద్దని గిరిజనుల ధర్నా

- కెఆర్‌పురం ఐటిడిఎ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో నిర్మాణం చేపట్టొద్దని కెఆర్‌పురం ఐటిడిఎ వద్ద పెద్ద ఎత్తున్న గిరిజనులు ధర్నా చేశారు. దీనిని తక్షణమే నిలుపుదల చేయాలని, రెండు పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో నిర్మించొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేవీ ఆయుధ డిపో వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, తెల్లం రామకృష్ణ మాట్లాడారు. పోలవరం నిర్మాణం పేరుతో వేల ఎకరాలు, చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం వందల ఎకరాలు, జాతీయ రహదారి పేరుతో మరికొన్ని ఎకరాలు భూసేకరణ చేసి ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయ భూములు లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. నేవీ ఆయుధ డిపో వస్తే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నాయకులు చెబుతున్నారని, పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వస్వం కోల్పోయిన గిరిజనులకు పూర్తి పరిహారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పోలవరం నిర్మాణంలో ఎన్ని ఉద్యోగాలు గిరిజనులకు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకంగా తీర్మానించినా, పీసా కమిటీ వ్యతిరేకిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లాలని చూడటం దారుణమన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. నేవీ ఆయుధ డిపో నిర్మాణానికి గిరిజనుల పట్టా భూములు తీసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. మీరు తెలియజేసిన అంశాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తాం

- కర్నూలులో వాల్మీకి జయంతి వేడుకల్లో మంత్రి సవిత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి వేడుకలను మంగళవారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పూలమాల వేసి, జ్యోతి ప్రజల్వన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో మరిన్ని బిసి గురుకుల పాఠశాలల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బిసి విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ వాల్మీకి భవన్‌కు టిజివి సంస్థ నుండి ఒక కోటి రూపాయలు విరాళంగా ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పది వేల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెట్టడానికి పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ జిల్లాల్లోని పశ్చిమ ప్రాంతంలో అక్షరాస్యత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాలకు మరమ్మతులు చేసేందుకు ఎస్టిమేట్ సిద్ధం చేసి మంత్రులకు సమర్పిస్తామన్నారు. ఎంపిలు బస్తిపాటి నాగరాజు, అంబికా, లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, పార్థసారథి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ బిటి నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడారు. ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, కురువ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ దేవేంద్రప్ప, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి, బిసి సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బిసి సంక్షేమ అధికారి ప్రసూన, వాల్మీకి సంఘం నాయకులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



గాజువాక జోగవానిపాలెంలో కంచాలు కొడుతున్న జెవివి నాయకులు

'అదాని సిమెంట్' అనుమతుల రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక, వార్వా, నివాస్, సిపిఎం ఆధ్వర్యంలో గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లోని పలు కాలనీల్లో మంగళవారం నిరసన తెలిపారు. స్వతంత్రనగర్, దుర్గా నగర్, బాలాజీ కాలనీ, అక్కిరెడ్డిపాలెం, జోగవానిపాలెం ప్రాంతాల్లో ప్లేట్లు పట్టుకొని ఆందోళన చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీని తరిమికొట్టాలని, నిర్మాణం, అనుమతులు రద్దు చేయాలని కంచాలు వాయిస్తూ నినదించారు. బుధవారం జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు తరలి వచ్చి సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వతంత్రనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. గో బ్యాక్ అదానీ సిమెంట్ అంటూ నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఎం రమేష్ కుమార్, పాలూరు లక్ష్మణస్వామి, ఎస్‌వికె పరశురాం, సిపిఎం నాయకులు ఎం శ్రీదేవి, జి లక్ష్మి, అన్నపూర్ణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడిని ఖండిస్తూ నిరసనల వెల్లువ

- సిపిఎం, ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- నిందితుడిని కఠినంగా శిక్షించాలి : లోకనాథం

ప్రజాశక్తి - యంత్రాంగం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఆందోనలు మిన్నంటాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. న్యాయదేవతకు జల, పాలాభిషేకం చేశారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనలు తెలిపారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాది కిషోర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై భారత రాష్ట్రపతి ముర్ము స్పందించి, సనాతనవాదులను, దేశద్రోహులను కఠినంగా శిక్షించడానికి రాజ్యాంగాన్ని అమలు చేయవలసిన అవసరం ఉందని సూచించారు.

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోటలో బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. విశాఖ జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద ఐఎల్ఎ, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులు సంయుక్తంగా రాస్తారోకో నిర్వహించారు. విశాఖ జగదాంబ జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడమంటే, రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. నిందితుడిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇప్పుడు బహిరంగంగా సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి పాల్పడడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానం అని పేర్కొన్నారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నవయానం బహుజన సంక్షేమ సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు తెలిపారు.

శ్రీకాకుళం అంబేద్కర్ కూడలి వద్ద చేపట్టిన ఆందోళనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. సిజెఐపై దాడిని ఒక వ్యక్తి చేసిన దాడిగా చూడకూడదని, బిజెపి, సంఘపరివార్ శక్తులు సమాజంలో నింపుతున్న మతోన్మాద విష బీజాల ఫలితమేనన్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్ తల్లిని నాలుగు రోజుల కిందట ఆర్ఎస్ఎస్ సభలకు పిలిచినా ఆమె నిరాకరించారని, ఆ ద్వేషంతోనే దాడికి పాల్పడ్డాడని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లాలో పాత కోర్టుల ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహానికి జలాభిషేకం చేసి శుద్ధి చేశారు. భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, పొక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆచంటలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తాడేపల్లిగూడెంలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన నిరసనలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు. భీమవరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ప్రసంగించారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాదులందరూ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. తిరుపతి బాలాజీ కాలనీ వద్ద మహాత్మాపూలే విగ్రహం నుంచి జిల్లా కోర్టు వరకూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు, దళితసంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. తెనాలిలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. సిజెఐపై దాడిని నెల్లూరు బార్ అసోసియేషన్, ఎపి స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు ఓ ప్రకటనలో ఖండించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట, ఆలూరు, ఆస్పరి, ఎమ్మిగనూరులో నిరసన తెలిపి, ఈ చర్యను తీవ్రంగా ఖండించారు.

కడప, అన్నమయ్య జిల్లాల్లో సిపిఎం, ప్రజాసంఘాలు, న్యాయవాదులు నిరసన తెలిపారు. దాడిని ఖండిస్తూ ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో భారత హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లా డారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే అది వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్యంపై, లౌకికవాదంపై దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు.



అంబేద్కర్ స్మృతివనం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


పశ్చిమగోదావరిలో న్యాయదేవత విగ్రహానికి పూలమాల వేస్తున్న న్యాయమూర్తి

కామెర్లతో గిరిజన యువకుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు నిమ్మక సుమన్ (23) పచ్చకామెర్లతో మృతి చెందారు. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... గత వారం రోజులుగా తీవ్రమైన జ్వరంతో సుమన్ బాధపడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు కురుపాం ఆస్పత్రికి శనివారం తీసుకువెళ్లారు. వైద్యం చేసినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి ఆదివారం తరలించారు. పరీక్షించిన వైద్యులు పచ్చకామెర్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వ్యాధి తీవ్రత అధికమవ్వడంతో సోమవారం రాత్రి మరణించారు. సుమన్ డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నారు. చేతికి అంది వచ్చిన కొడుకు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు రమేష్, హేమలత కన్నీరు మున్నీరుగా విలపించారు.

సిబిఐ దర్యాప్తుపై పిటిషన్ వెనక్కి..

- తాడేపల్లి పోలీసుల నిర్ణయం

ప్రజాశక్తి, అమరావతి

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సౌందరరెడ్డి అలియాస్ సవీందర్ రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన ఘటనపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలంటూ వేసిన పిటిషన్‌ను తాడేపల్లి పోలీసులు ఉపసంహరించుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణకు వీలుగా ఉపసంహరించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈమేరకు పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి. విష్ణుతేజ చేసిన వినతిని జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ టి. చంద్ర ధనశేఖర్ ధర్మాసనం ఆమోదించింది. పిటిషనర్ వాపస్ తీసుకునేందుకు అనుమతిస్తూ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేసింది. సౌందరరెడ్డిని ప్రత్తిపాడు పోలీసులు గత నెల 22న మఫ్టీలో వచ్చిన అదుపులోకి తీసుకోవడంతో ఆయన భార్య కుంచాల లక్ష్మీప్రసన్న హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన ధర్మాసనం పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారనే నిర్ధారణకు వచ్చింది. పోలీసులు తమ తప్పు నుంచి బయట పడేందుకు అక్రమంగా గంజాయి కేసులో నిందితుడ్ని ఇరికించారని, దీనిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ గత నెల 26న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలంటూ తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సోమవారం అనుబంధ పిటిషన్ వేశారు. తమకు కౌంటర్ దాఖలుకు కూడా అవకాశం ఇవ్వలేదని తెలిపింది. మంగళవారం ఈ అనుబంధ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పోలీసులు కోరడంతో ధర్మాసనం అనుమతిచ్చింది.

తమ్ముడికి చంద్రబాబు నివాళి


తమ్మునికి నివాళి అర్పిస్తున్న నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తన తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు సంవత్సరీకానికి (11 నెలల విస్తరి) ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా నారావారిపల్లికి మంగళవారం ఉదయం 11.30 గంటలకు విచ్చేశారు. నారావారిపల్లిలోని స్వగృహంలో సంవత్సరీక కార్యక్రమాలు జరిగాయి. నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి పెద్దతరహాగా వ్యవహరిస్తూ తలకొరివి పెట్టిన రామ్మూర్తినాయుడు కొడుకు, సినీహీరో నారా రోహిత్‌తో పూజా కార్యక్రమాలు చేయించారు. నారా రామ్మూర్తి చిత్రపటానికి ఆయన సతీమణి నారా ఇందిర, నారా లోకేష్, రామ్మూర్తి పెద్దకొడుకు నారా గిరీష్ నివాళి అర్పించారు. అక్కడినుంచి చంద్రబాబునాయుడు తల్లిదండ్రుల సమాధి వద్దనే ఏర్పాటు చేసిన నారా రామ్మూర్తి ఘాట్ వద్ద నివాళి అర్పించారు. అనంతరం గ్రామస్తులను పలకరించి అర్జీలను స్వీకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 2.20 గంటలకు ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దనుండే నారా చంద్రబాబు, నారా లోకేష్ వెళ్లిపోయారు. రేణిగుంట ఎయిర్‌పోర్టు చేరుకుని, అక్కడనుంచి విజయవాడకు బయల్దేరి వెళ్లారు. నారా చంద్రబాబునాయుడుకు స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో ఎంఎల్‌ఎలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాస్, డాక్టర్ మురళీమోహన్, గురజాల జగన్మోహన్, థామస్, నెలవల విజయశ్రీ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్ఎ ఎం.సుగుణమ్మ ఉన్నారు.

మత్స్యకారుల సమస్యలపై కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం, పరిసర గ్రామాల మత్స్యకారులు కాలుష్యం వల్ల జీవనోపాధి కోల్పోవడం, సంబంధిత సమస్యల పరిష్కారాలు సూచించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో పరిశ్రమల శాఖ కమిషనర్, మత్స్యశాఖ కమిషనర్, ఎపి పొల్యూషన్ బోర్డు ప్రతినిధి సభ్య కార్యదర్శిగా, జిల్లా కలెక్టర్ సభ్య సంధాత, జిల్లా కలెక్టరుచే సిఫార్సు చేయబడిన మత్స్యకార ప్రతినిధులు ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీ మత్స్యకారులు లేవనెత్తిన అంశాలపై పరిశీలన చేసి తక్షణ, దీర్ఘకాలిక పరిష్కార చర్యలను సూచించడం, మత్స్యకారుల సంక్షేమానికి అవసరమని భావించే ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సి ఉంటుందని సూచించారు.

జగన్ రోడ్డు పర్యటనకు అనుమతి లేదు

హెలికాప్టర్ ద్వారా వెళ్తామంటే పరిశీలిస్తాం : ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి - అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 9న విశాఖపట్నం నుంచి నర్సీపట్నం రోడ్డు పర్యటనకు ప్రజల భద్రత దృష్ట్యా అనుమతించేదిలేదని అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా తెలిపారు. అనకాపల్లి ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గం పరిధి మాకవరపాలెంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల సందర్శనకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో సుమారు 63 కిలోమీటర్లు ప్రయాణానికి పోలీస్ సెక్యూరిటీ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. ఈ జాతీయ రహదారి ప్రధాన కూడళ్లయిన లంకెలపాలెం, కొత్తూరు, తాళ్లపాలెం, డైట్ కళాశాల జంక్షన్, మర్రిపాలెంలో వేలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డికి జడ్ కేటగిరి భద్రత ఉన్నందున ఈ మార్గంలో జన సమీకరణ జరిగితే పరిశ్రమల ఉద్యోగులు, ఫార్మా ఉద్యోగులు, అంబులెన్సులకు తీవ్ర ఇబ్బందులు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. హెలికాప్టర్ ద్వారా విశాఖ నుంచి మాకవరపాలెం వెళ్లేందుకు దరఖాస్తు పెడితే పరిశీలిస్తామని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడడం, గుంపులుగా చేరడాన్ని అనుమతించేది లేదన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి ఎం దేవప్రసాద్, నర్సీపట్నం డిఎస్‌పి పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లేఖ ద్వారా తెలియజేశాం : విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ పర్యటనకు పోలీసు భద్రత ఇవ్వలేమని లేఖ ద్వారా తెలిపినట్లు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ రోజున ఐసిసి ఉమెన్స్ వరల్డ్ కప్ మ్యాచ్ విశాఖ వేదికగా జరగనున్న సందర్భంగా పెద్ద మొత్తంలో ప్రేక్షకులు మ్యాచ్‌కు హాజరయ్యే ఆస్కారం ఉందని ఇంటెలిజెన్స్ ద్వారా తమకు సమాచారం అందిందని తెలిపారు. ఈ క్రమంలో మొత్తం పోలీస్ సిబ్బందిని స్టేడియం వైపు ఇప్పటికే మోహరించామని చెప్పారు. ఇటీవల తమిళ నాడులో సినీ నటుడు విజయ్ రోడ్ షో మాదిరిగా ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున ఈ పర్యటనకు పోలీస్ అనుమతి ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - అమరావతి

మద్యం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి మంగళవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. మద్యం కేసులో మోహిత్‌రెడ్డి 39వ నిందితుడిగా ఉన్నారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలనే పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. తీర్పుప్రతి అందుబాటులోకి వస్తే ముందస్తు బెయిల్‌పిటిషన్‌ను కొట్టివేయడంపై పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

10 టన్నులకు పైగా ఎర్రచందనం పట్టివేత

- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్
- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించిన రూ.10 కోట్ల విలువైన 10300 కిలోల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆపరేషన్‌లో రాష్ట్ర ఇంటెలిజెన్సీ అందించిన సమాచారంతో పోలీసులు (రెడ్ సాండిల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్), టాస్క్ ఫోర్స్/సౌత్ ఈస్ట్ డిస్ట్రిక్ట్ ఢిల్లీ పోలీసుల సంయుక్త బృందం, తుగ్లకాబాద్ లోని ఓ గొడౌన్‌లో దాడి చేసిన స్వాధీనం చేసుకున్నట్లు డిజిపి తెలిపారు. ఎర్రచందనం దొంగతనం గురించి తిరుపతి పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టులో ఎఫ్ఐఆర్ చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 6న ఢిల్లీలో అంతర్రాష్ట్ర మాఫియా హైదరాబాద్ టోలీ చౌకికి చెందిన ఇర్ఫాన్ అలియాస్ నూర్‌మహమ్మద్ ఒకరని, ఇతరు గతంలో 2203లో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి తిరుపతిలో అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

హేతుబద్ధ వినియోగంతోనే రక్త కొరతను అధిగమించొచ్చు

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

సుమారు 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో రక్త అవసరాన్ని తీర్చడం అంత సులభం కాదని, ఇలాంటి పరిస్థితుల్లో 'హేతుబద్ధ వినియోగం' అనేది ఒక జీవన విధానంగా మారాలని, తద్వారా రక్త సరఫరా కొరతను అధిగమించొచ్చని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రక్త మార్పిడి సేవల విభాగం, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో 'రక్తం, రక్త ఉత్పత్తుల హేతుబద్ధ వినియోగం' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మన దేశంలో ఏటా సుమారు 1.5 కోట్ల యూనిట్లు రక్త పరిమాణం అవసరముంటున్నట్లు అంచనా కాగా, 10 నుంచి 40 లక్షల యూనిట్ల కొరత ఉందని నివేదికలు చెబుతున్నాయని వివరించారు. డబ్ల్యుహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా జనాభాలో కనీసం ఒక శాతం మంది రక్తదాతలుగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, దాని ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 5.3 లక్షల యూనిట్లు అవసరం కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 7 లక్షల యూనిట్లకుపైగా సేకరించగలిగామని గుర్తు చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా రక్త వినియోగంలో శాస్త్రీయ, మానవతా దృక్పథాలను సమన్వయం చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్సల ముందు రక్తహీనతను తగ్గించే చర్యలుగా ఐరన్ సప్లిమెంట్లు, ఎరిత్రోప్రొటీన్ వంటివి రక్త మార్పిడికి ప్రత్యామ్నాయాలుగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ వర్క్ షాప్‌లో భాగంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీత శర్మ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మేగా ప్రవీణ్ ఖోబ్రగడే, ఎన్‌బిటిసి డైరెక్టర్ డాక్టర్ కృషణ్‌కుమార్, ఎపి స్టేట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసన్న వివిధ అంశాలపై మాట్లాడారు. డబ్ల్యుహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ మాధుర్ గుప్తా, ఆర్.గణపతిరావు, డాక్టర్ శాంతాసింగ్, వివిధ రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల వైద్యాధికారులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు దుర్మార్గం

- ధర్నాలో పలు సంఘాల నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికులకు పనిగంటలు పెంచడాన్ని నిరసిస్తూ విజయవాడ లెనిన్ సెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, షాప్ ఎంప్లాయీస్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, జె ప్రభాకర్ రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటల పెంపుతో టిడిపి కూటమి ప్రభుత్వం కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానంలో మార్పు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపుపై కనీసం కార్మిక, కర్షక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి ఐదేళ్లకు కనీస వేతనాలను సవరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత మూడు దఫాలుగా సవరించకుండా కనీస వేతన చట్టాన్ని తుంగలో తొక్కిందని విమర్శించారు. యజమానులకు లాభాలు చేకూర్చటం మినహా కార్మికుల సంక్షేమం గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు కలిపి ఫ్యాక్టరీలు, కంపెనీలు తదితర సంస్థల్లో తనిఖీలు లేకుండా చేశాయని, దీంతో భవిష్యత్తులో కార్మిక శాఖ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి 13 గంటల పని విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె కల్యాణ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, సిఐటియు జిల్లా, నగర నాయకులు ఎం బాబూరావు, ఎం సోమేశ్వరరావు, షాప్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వై సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ లెనిన్ సెంటర్లో ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, శ్రేణులు

అధిక సుంకాలతో భారత వృద్ధి తగ్గొచ్చు

- చైనా జిడిపి పెరగొచ్చు
- ప్రపంచ బ్యాంక్ అంచనా



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలు భారత వృద్ధిని దెబ్బతీయొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. అధిక టారిఫ్‌లతో భారత ఎగుమతులు తగ్గొచ్చని.. దీంతో వచ్చే ఏడాది దక్షిణాసియా వృద్ధి రేటు మందగించవచ్చని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జిడిపి 6.5 శాతంగా ఉండొచ్చని.. వచ్చే ఏడాది 2026-27లో 6.3 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. భారత్ నుంచి చేసుకునే దిగుమతులపై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడంతో 50 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులపై ప్రభావం పడనుందని గుర్తు చేసింది. 2025-26లో దక్షిణాసియా వృద్ధి 6.6 శాతంగా ఉండొచ్చని.. తదుపరి 2026-27లో 5.8 శాతానికి తగ్గొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. బలహీన ఎగుమతులతో భారత్, మాల్దీవులు, నేపాల్ విదేశీ మారకం ఒత్తిడికి గురి కావొచ్చని తెలిపింది.ఇదే సమయంలో చైనా జిడిపి మాత్రం పెరగొచ్చని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. ప్రస్తుత 2025-26లో చైనా జిడిపి 4 శాతంగా ఉండొచ్చని ఏప్రిల్‌లో వేసిన అంచనాలను ఏకంగా 4.8 శాతానికి పెంచింది. అమెరికా టారిఫ్‌ల పెంపు ఉన్నప్పటికీ చైనాలో దేశీయ డిమాండ్ పెరగడమే ప్రధాన కారణమని పేర్కొంది. సుంకాల ప్రభావాన్ని తగ్గించేందుకు భారత ప్రభుత్వం వినియోగ వస్తువులు, ఆటోమొబైల్స్‌పై పన్ను తగ్గింపులను ప్రకటించినప్పటికీ, అలాగే మౌలిక సదుపాయాల వ్యయాన్ని పెంచుతోన్నట్లు ప్రకటించినప్పటికీ ప్రపంచ బ్యాంక్ భారత జిడిపి అంచనాలకు కోత పెట్టడం విశేషం. కరోనా తర్వాత రికవరీ ఊపు తగ్గడం, కొత్త వాణిజ్య అడ్డంకులతో దక్షిణాసియా వృద్ధి మందగిస్తుందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

సంపాదకీయం

సంక్షేమమేది?

అందరి సంక్షేమమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వాలు అధికారం వెలగబెడుతున్నా.... హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటున్న చిన్నారుల ఆలనా పాలనా పట్టించుకునే వారే లేరు. ఏళ్ల తరబడి కలుషిత నీరు తాగుతున్నా, మెనూ ప్రకారం ఆహారం అందకపోయినా, హైకోర్టు చీవాట్లు పెట్టినా పరిస్థితుల్లో మార్పేమీ లేదు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పార్వతీపురం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్లే 9, 10 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న 611 మంది బాలికల్లో 140 మంది పచ్చకామెర్లకు గురై జిల్లా కేంద్ర, విశాఖ కెజిహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు.

సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా చదువులు అర్థాంతరంగా ఆగిపోకూడదన్న సంకల్పంతో గురుకులాలు, వసతి గృహాలు ఏర్పాటయ్యాయి. 39 (ఎఫ్) రాజ్యాంగ అధికరణం ప్రకారం ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో ఎదిగే అవకాశాలను, సౌకర్యాలను పిల్లలకు అందిస్తూ పీడన, వెలివేతల నుంచి కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. 46వ అధికరణం ప్రకారం అణగారిన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక అన్యాయం, దోపిడీల నుంచి వారిని రక్షించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానాలతో విద్య అంగడి సరుకుగా మారిపోయింది. రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఊసేలేదు. సరళీకరణ విధానాలతో కాయకష్టం చేసే వారికి రోజూ పనులు దొరక్కపోవడం, ఉంటుందో, ఊడుతుందో తెలీని ప్రైవేటు ఉద్యోగాలు, తగ్గిపోయిన వేతనాలు, పెరిగిన పని గంటలు, కుటుంబాలు గడవడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో, పేద, అణగారిన వర్గాలకు చెందిన నాలుగు లక్షల మందికిపైగా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లే ఆధారమవుతున్నాయి. వీటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డైట్ ఛార్జీలు చెల్లించకపోవడం ఆనవాయితీగా మారిపోయింది. మెనూ అమలు ఊసేలేదు. పౌష్టికాహారం అందకపోవడం, తాగునీటి కాలుష్యం, అపరిశుభ్రత తదితర కారణాల వల్ల తరచూ అతిసార, విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు గురవడం సర్వసాధారణమైపోయింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు సైతం వెలుగుచూస్తున్నాయి.

రాష్ట్రంలో 65 హాస్టళ్లను పరిశీలించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ... నర్సీపట్నంలోని ఓ బాలికల హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి, ఒకటే బాత్రూమ్ ఉండటంసహా అనేక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ పరిస్థితిపై చలించిపోయిన రాష్ట్ర హైకోర్టు విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు లేకపోతే ఎలా? అవసాన దశలో ఉన్న హాస్టల్ భవనాలు కూలిపోతే విద్యార్థులేం కావాలి? మన ఇంట్లో పిల్లల్ని నేలపై పడుకోబెడతామా? ఏటా ప్రభుత్వం కేటాయించే కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం మౌలిక వసతులన్నీ ప్రభుత్వమే కల్పించాలంటూ గత జులైలో ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా సీనియర్ అధికారులు నెలవారీగా తనిఖీలు చేయాలని, ఆ నివేదికలను తెప్పించుకోవాలని సిఎస్‌లను ఆదేశించింది. హైకోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేసినా... పరిస్థితుల్లో ఏమాత్రం చలనం లేదనడానికి కురుపాం హాస్టల్ దుస్థితే నిదర్శనం. ఆర్‌ఒ సిస్టమ్ పాడై, పరిశుభ్రమైన తాగునీరు అందుబాట్లో లేకపోవడమే విద్యార్థినుల ప్రాణాంతక పచ్చకామెర్లకు ప్రధాన కారణం. పిల్లలు ఇళ్ల వద్ద చనిపోతే ప్రభుత్వానిది బాధ్యతెలా అవుతుందని, నష్టపరిహారం ఎలా ఇస్తామని పార్వతీపురం జిల్లాకే చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం వల్లే వారు హాస్టళ్లలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న విషయాన్ని పట్టించుకోకపోవడం సమంజసమా? బాధితులు, గిరిజనులు డిమాండ్ చేసిన విధంగా... మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు ఉన్నాయని, పశువులకు కూడా హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల సిఎం ప్రకటించారు. పిల్లల హాస్టళ్లను మెరుగుచేయకుండా పశువులకు హాస్టల్ అనడం సమంజసమేనా? కేరళలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరగడానికి అక్కడి ప్రభుత్వ విధానాలే కారణమని గుర్తించాలి. ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా నవతరాన్ని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగితేనే ఇటువంటి పరిస్థితులను అధిగమించగలం. ఆ దిశగా ప్రజలంతా సంఘటితంగా ఒత్తిడి తేవాలి.

మహనీయుని మాట



సంపద, కరుణ వ్యతిరేక పదాలు.

- మున్షి ప్రేమ్‌చంద్, ప్రముఖ హిందీ, ఉర్దూ కవి.

జననం: 31.7.1880

మరణం: 8.10.1936

వ్యాఖ్య


అయోధ్య, కాశీ వివాదాలు..చంద్రచూడ్ సంకేతాలు...

అయోధ్య, కాశీ సమస్యలు మళ్లీ రగులుకోవడం ఒక పెద్ద విపరీతం. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులతో ఈ సమస్యలు అలా అనిశ్చితంగా పక్కన పెట్టబడ్డాయి. అయోధ్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చాలామందికి అసలు అంతుపట్టలేదు. బాబ్రీ మసీదును నేరపూరితంగా విధ్వంసం చేసిన వారికి యాజమాన్యం అప్పగించడం, రామాలయ నిర్మాణం అనుమతించడం అందుకు కారణం. వాస్తవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రామమందిరం ప్రారంభోత్సవంలో న్యాయవ్యవస్థ ఇచ్చిన చెల్లుబాటును నొక్కి చెప్పారు. మేము అందుకు భిన్నంగా చెప్పవలసి వుంటుంది. "సుప్రీం కోర్టు తీర్పు నిచ్చింది, కానీ న్యాయం చేయలేదు."

అయితే ఇప్పుడు మాజీ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ 'న్యూస్‌లాండ్రీ'కి చెందిన శ్రీవాత్సవ్ జైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మొత్తం సమస్యను తిరగదోడారు. సెప్టెంబరు 24 నాటి ఆ ఇంటర్వ్యూలో చంద్రచూడ్ ఇలా అన్నారు: "పురావస్తు తవ్వకాల ద్వారా తగినంత సాక్ష్యాధారం లభించింది. ఇప్పుడు ఆ పురావస్తు తవ్వకాలకు సాక్ష్యంగా వుండే విలువెంత అన్నది పూర్తిగా వేరే ప్రశ్న. నేను నిజంగా చెప్పదలుచుకున్న విషయమంతా ఒక్కటే. పురావస్తు తవ్వకాల నివేదిక రూపంలో సాక్ష్యం వుంది".

"ఇక్కడ వాదన ఒకటే. హిందువులు కూడా అపచారాలు చేయడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడటం, అల్లర్లు సృష్టించడంతో ఆ (మసీదు) లోపలి ఆవరణ వివాదాస్పదమైంది. ముస్లింలు బయటి ఆవరణలో అలాంటివి చేయలేదన్నది నిజం. దాన్ని వారు కూడా విభేదించలేదు. కనక వారిని శిక్షించడానికి ఇది సరిపోతుంది. హిందువులు పోరాటం చేస్తుంటే మీరు ఎదుర్కోలేదన్నది వాస్తవానికి ముస్లింలకు వ్యతిరేకమైన అంశంగా మారుతుంది. ఈ తీర్పును విమర్శనాత్మకంగా చదివితే ఇది అర్థమవుతుంది కదా" అని జైన్ వేసిన ప్రశ్నకు మాజీ సిజెఐ ఇచ్చిన వివాదాస్పద జవాబు ఇది. "ఆవరణలో అపచారాలకు పాల్పడింది హిందువులు అని మీరు అంటున్నారంటే అసలు మొదట జరిగిన అపచారం అంటే మసీదు నిర్మాణం అనే ప్రాథమిక చర్య సంగతేమిటి? మీరు ఆ జరిగినవన్నీ మర్చిపోతారా? చరిత్రలో జరిగినవి మనం మర్చిపోదామా?"

> జైన్ వేసిన ప్రశ్నకు మాజీ సిజెఐ ఇచ్చిన వివాదాస్పద జవాబు ఇది: "ఆవరణలో అపచారాలకు పాల్పడింది హిందువులు అని మీరు అంటున్నారంటే అసలు మొదట జరిగిన అపచారం అంటే మసీదు నిర్మాణం అనే ప్రాథమిక చర్య సంగతేమిటి? మీరు ఆ జరిగినవన్నీ మర్చిపోతారా? చరిత్రలో జరిగినవి మనం మర్చిపోదామా?"



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

తొలగిన ముసుగు!

న్యాయపరమైన ప్రకటనలు మరీ ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాల నుంచి వచ్చేవి అనేక పద విన్యాసాలతో కఠిన కోణాల పదును కనపడకుండా ముసుగు తెరలను కప్పిపెడుతుంటాయి. వాటిని రాసినవారు చెబితే తప్ప వాటిని మనం అర్థం చేసుకోవడం కాదు కదా అసలు వున్నాయన్నదే పసిగట్టలేం. అయోధ్య తీర్పు విషయంలో ఇది మరింత నిజం. ఈ ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్ చెప్పింది తీర్పుకు పూర్తి తేడాగా వుంది, పురావస్తు తవ్వకాల నివేదిక గురించి అందులో చెప్పింది వేరే. "ఆ ప్రదేశంలో లభ్యమైన పురావస్తు శకలాలు, ఆ నిర్మాణం స్వభావం బట్టి అది హిందూ మత సంబంధమైనదని ఆ నివేదిక నిర్ణయానికి వచ్చింది (సున్నీ వక్ఫ్ బోర్డు అభ్యర్థించినట్టుగా). దాని దిగువన ఇస్లామిక్ కట్టడం వుండివుండవచ్చుననే అవకాశాన్ని తిరస్కరించింది. అయితే ఎ.ఎస్.ఐ నివేదిక దానికి అప్పగించిన అతి ముఖ్యమైన భాగానికి సమాధానం ఇవ్వకుండా వదిలేసింది. మసీదు నిర్మించడం కోసం ఒక హిందూ ఆలయాన్ని ధ్వంసం చేయబడిందా అన్న ప్రశ్నకు మాత్రం అందులో సమాధానమివ్వలేదు. నిర్దిష్టమైన నిర్ధారణకు రాలేకపోయిన ఎ.ఎస్.ఐ అశక్తత ఖచ్చితంగా చాలా కీలకమైంది. అంతిమ విశ్లేషణలో మొత్తం సాక్ష్యాధారాల ప్రభావాన్ని అంచనా కట్టినప్పుడు తప్పక మనసులో వుంచుకోవలసిన సాక్షీభూత పరిస్థితి అది." అని పేర్కొంది.

తీర్పుతో వివాదానికి బాట

ఆ ఉత్తర్వులో ఇంకా ఇలా వుంది: ఈ దశలో తప్పక చెప్పవలసిన మరో అంశం వుంది. ఈ యాజమాన్యం ఎవరిదనేది బేరీజు వేసినపుడు దాన్ని పరిశీలించడం జరుగుతుంది. ఎ.ఎస్.ఐ నిర్ధారణల ఆధారంగానే యాజమాన్య హక్కును తేల్చడం సాధ్యమేనా అన్నదే ఆ ప్రశ్న. 450 ఏళ్ల కిందట 1528లో మసీదు నిర్మాణం అంతకు ముందున్న 12వ శతాబ్దికి చెందిన మత కట్టడంపైనే జరిగిందా అనేదానిపై తీసుకునే నిర్ణయమే యాజమాన్యం ఎవరికి చెందుతున్న ప్రశ్నకు సమాధానం చెబుతుంది. అది వేరే విషయం. యాజమాన్యం ఎవరిదనేది తేల్చే పని ఎ.ఎస్.ఐ పరిధిలోది కాదని మాత్రం ఇక్కడ చెబితే సరిపోతుంది. తీర్పునిచ్చే సమయంలో భూమిపై హక్కు ఎవరిదన్నది పరిశీలించినపుడే ఆలోచించి వాస్తవికమైన నిర్ధారణకు రావడం జరుగుతుంది". కనుక "పురావస్తు తవ్వకాల ద్వారా తగినంత సమాచారం వుందని" జస్టిస్ చంద్రచూడ్ ఈ ఇంటర్వ్యూలో తేల్చి చెబుతున్నట్టు...మసీదు కట్టడానికి ఆలయం ధ్వంసం చేయబడిందనే నిర్ణయాత్మక నిర్ధారణకు అత్యున్నత న్యాయస్థానం ఏ దశలోనూ రానేలేదు.

కాశీలో జ్ఞానవాపి మసీదులో తవ్వకాలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు ధర్మాసనం "ఒక మత కట్టడం ఏ తరహాకు చెందిందో పరిశోధించవచ్చు. కానీ మార్చడానికి లేదు" అని సిఫార్సు చేయడంలో అంతర్గతంగా దాగిన పచ్చి వైరుధ్యం కూడా ఇదే. జస్టిస్ చంద్రచూడ్ మాటల్లోనూ ఇందులోని మెజారిటీవాద అదే ధోరణిని కనుగొనవచ్చు. ప్రార్థనా ప్రదేశాల చట్టం నేపథ్యంలో అయోధ్య తప్ప మరే ఇతర మత ప్రదేశాన్ని న్యాయపరంగా సవాలు చేయడానికి అవకాశమే లేదు. అందువల్ల అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న వైఖరి వల్లనే వివాదాలకూ విద్వేషాలకు, హింసాకాండకు బాట వేసినట్టయిందని చెప్పాలి.

రాజ్యంతో పాటే న్యాయం

'న్యూస్‌లాండ్రీ' ఇంటర్వ్యూ బయటికి వచ్చాక అంతా కల్లోలమైపోయింది. ఏమైనా ప్రజల్లో చర్చ జస్టిస్ చంద్రచూడ్ వ్యక్తిత్వం, పాత్రకే పరిమితమైపోయింది. మాజీ సిజెఐ భాగం పంచుకున్న అనేక ఇతర తీర్పులు, ప్రత్యేకించి ఆరెస్సెస్, బిజెపి కి రాజకీయంగా లాభం కలిగించిన తీర్పులు ప్రస్తావ-నకు వస్తున్నాయి.

దురదృష్టవశాత్తూ ఈ పరిస్థితి అనివార్యమే. అయితే కేవలం ఆయనపై వ్యక్తిగత పరిశీలనకే పరిమితమైతే అది మొక్కలు చూస్తూ అడవిని మరిచిపోయిన చందమవుతుంది. భారత దేశంలో రాజ్యం ఎలాంటి మార్పులకు గురైందో మర్చిపోతే మహా ప్రమాదం తెచ్చుకున్నట్టే. ఆరెస్సెస్ నిర్దేశిత బిజెపి పాలన కార్పొరేట్ కాషాయ బంధం పైనే ఆధారపడి నడుస్తున్నది. ఈ నూతన దిశ స్వభావ సిద్ధంగానే ఒక సంపూర్ణమైన మార్పుకు కారణమవుతుంది. దానివల్ల లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ తీవ్రంగా హరించుకుపోయి దెబ్బ తింటుంది. రాజ్యం కేవలం కార్యనిర్వాహక, శాసనాధికారాలకే పరిమితమై వుండదు. న్యాయవ్యవస్థ కూడా అందులో భగమే. అందుకనే రాజ్యాంగాన్ని మొత్తంగా లేకుండా చేయాలని తదేకంగా పని చేయడంతో పాటే న్యాయ వ్యవస్థపైనా ఆ ప్రభావం పడుతున్నది. న్యాయ వ్యవస్థను హిందూత్వ రథానికి అనుగుణంగా నడిపే ప్రయత్నాలు సాగుతున్నాయి. రిపబ్లిక్ సూత్రాలకూ, రాజ్యాంగ తత్వానికి అనుగుణంగా వెలువడిన కొన్ని ప్రసిద్ధమైన నిబద్ధ ఘట్టాలను మినహాయిస్తే అక్కడా వాటినుంచి వైదొలగడం జరుగుతున్నది. దురదృష్టవశాత్తూ అయోధ్య తీర్పుగానీ జ్ఞానవాపి తీర్పుగానీ ఆ విధంగా రాజ్యాంగ సూత్రాలనూ ఆ ప్రాతిపదికన ఏర్పడిన ఈ దేశ చట్టాలను నిలబెట్టేవిగా లేవు.

> కాశీలో జ్ఞానవాపి మసీదులో తవ్వకాలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు ధర్మాసనం "ఒక మత కట్టడం ఏ తరహాకు చెందిందో పరిశోధించవచ్చు. కానీ మార్చడానికి లేదు" అని సిఫార్సు చేయడంలో అంతర్గతంగా దాగిన పచ్చి వైరుధ్యం కూడా ఇదే. జస్టిస్ చంద్రచూడ్ మాటల్లోనూ ఇందులోని మెజారిటీవాద అదే ధోరణిని కనుగొనవచ్చు. ప్రార్థనా ప్రదేశాల చట్టం నేపథ్యంలో అయోధ్య తప్ప మరే ఇతర మత ప్రదేశాన్ని న్యాయపరంగా సవాలు చేయడానికి అవకాశమే లేదు. అందువల్ల అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న వైఖరి వల్లనే వివాదాలకూ విద్వేషాలకు, హింసాకాండకు బాట వేసినట్టయిందని చెప్పాలి.

(అక్టోబరు 1 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

అంతర్జాతీయం

ఒకవైపు కార్మికవర్గంపై దాడి - మరోవైపు రష్యాతో లడాయి!

పశ్చిమ దేశాల తీరు

నాటో కూటమితో చేతులు కలిపి తమ మీద చేస్తున్న కుట్రకు ప్రతి చర్యగా ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య నేటితో 1,322వ రోజుకు చేరుకుంది. పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఐరోపా అంతటా దోపిడీకి గురౌతున్న కార్మికుల సమ్మెలు ఒకవైపు, మరోవైపు రష్యాను దెబ్బ తీసేందుకు అమెరికాతో కలసి పాలక వర్గాల కుట్రలు కనిపిస్తున్నాయి. తమ మీద దాడులు చేసేందుకు అమెరికా గనుక తోమహాక్ క్షిపణులను ఉక్రెయిన్‌కు ఇస్తే సంబంధాలు నాశనం అవుతాయని రష్యన్ అధినేత వ్లదిమిర్ పుతిన్ అమెరికాను ఉద్దేశించి చెప్పాడు. నిజానికి ఇది ట్రంప్‌కే కాదు, కయ్యానికి ఎగదోస్తున్న యావత్ ఐరోపా ధనిక దేశాలకు చేసిన హెచ్చరిక. ఆ ప్రకటన మరుసటి రోజు డోనాల్డ్ ట్రంప్ విలేకర్లు అడిగిన ప్రశ్నలపై స్పందించాడు."నేనూ కొన్ని ప్రశ్నలు అడగదలచుకున్నాను, ఆ పోరు మరింతగా పెరగాలని కోరుకోవటం లేదు" అన్నాడు. పశ్చిమ దేశాలతో మరో ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నట్లు తమ మీద చేస్తున్న ఆరోపణను రష్యా తోసిపుచ్చింది. దాడులు చేసేందుకు, మిలిటరీ ఖర్చు పెంచేందుకు నెపాన్ని తమ మీద నెట్టాలని ఐరోపా యూనియన్, నాటో కూటమి దేశాలు లేనిపోని కథలను వ్యాపింప చేస్తున్నాయని, గత ప్రచ్ఛన్న యుద్ధంతో పోల్చటాన్ని అంగీకరించటం లేదని రష్యా విదేశాంగ ప్రతినిధి మరియా ఝకరోవా గత వారంలో స్పష్టం చేశారు.



ఎం. కోటేశ్వరరావు

రష్యా చెబుతున్న అంశాలను విననట్లు నటిస్తున్న పశ్చిమ దేశాలు తీవ్రమైన ఆంక్షలను ప్రకటించి దిగ్బంధనం కావించేందుకు చూసినప్పటికీ వాటన్నింటిని మాస్కో ఇప్పటి వరకు అధిగమించింది. మూడు వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను దెబ్బతీసే క్షిపణులను నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అందించి దాడులు చేయించాయి. ఫలితం లేకపోవటంతో ఇప్పుడు మాస్కోతో సహ రష్యాలోని ఐరోపా ప్రాంతాలన్నింటిపైనా దాడులు చేయగల రెండున్నరవేల కిలోమీటర్ల దూరం ప్రయాణించే తమ తోమహాక్ క్షిపణులను అందచేయాలని అమెరికా చూస్తున్నది. అనేక ఐరోపా దేశాలు వాటిని అడుగుతున్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వారం రోజుల క్రితం ప్రకటించాడు. నేరుగా ఉక్రెయిన్‌కు అందిస్తే విమర్శలపాలు కావాల్సి వస్తుందనే భయంతో ఇతర దేశాలకు విక్రయించి అక్కడి నుంచి మళ్లించాలన్నది ఎత్తుగడ. అయితే జెలెన్‌స్కీ సేనలకు వాటిని అందచేసినప్పటికీ ఉపయోగించే సామర్ధ్యం లేదు. ఆ విషయాన్ని అతడే స్వయంగా చెప్పాడు. ఆ క్షిపణులు తమ దగ్గర ఉంటే పుతిన్‌పై వత్తిడి పెంచటానికి తోడ్పడతాయని అన్నాడు. అందుకే అదే జరిగితే పశ్చిమ దేశాలతో సంబంధాల విచ్ఛిన్నానికి దారితీస్తుందని పుతిన్ హెచ్చరించాడు. ఇవ్వాలా లేదా అన్నది అమెరికా తేల్చుకోవాల్సి ఉంది. ఇస్తామంటే ఎలాంటి స్పందనలు వస్తాయో తెలుసుకొనేందుకు వాన్స్ ద్వారా ట్రంప్ మాట్లాడించాడు. రష్యా ఇంధన మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని ఉక్రెయిన్‌కు అందచేసేందుకు వాషింగ్టన్ నిర్ణయించిందని, వాటిని ధ్వంసం చేయాలంటే దీర్ఘశ్రేణి క్షిపణులు అవసరమౌతాయని వాటిని ఇవ్వటమా లేదా అన్న గుంజాటనలో ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక రాసింది.

> బడ్జెట్ లోటు ఏర్పడినపుడల్లా ఫ్రాన్సులో ఆ భారాన్ని కార్మికవర్గం మీద నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో జిడిపి లో ఐదు శాతం ఉన్నపుడు 1995లో జరిగిన ఆందోళనల్లో ఇరవై లక్షల మంది రోడ్ల మీదకు వచ్చారు. నాటి ప్రధాని అలైన్ జుపే అంతకు ముందు ప్రతిపాదించిన అనేక పొదుపు చర్యలకు స్వస్తి పలకాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. అధ్యక్షుడు మక్రాన్ 2023లో ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 64 సంవత్సరాలకు పెంచి పెన్షన్ బిల్లును తగ్గించేందుకు చూశాడు. ఇప్పుడు మరో మితవాద ప్రధాని లీకోర్న్ అదే విధానాలతో ఇంటిదారి పట్టాడు. ఐరోపా పాలకవర్గ సంక్షోభం, దానికి కార్మికవర్గం నుంచి ఎదురవుతున్న ప్రతిఘటనకు ఇది ఒక సాక్ష్యం.



అమెరికన్లు ప్రత్యక్షంగా పాల్గొంటే తప్ప తోమహాక్ క్షిపణులను ప్రయోగించటం అసాధ్యమని, అదే జరిగితే ఉద్రిక్తతలు నూతన దశకు చేరతాయని పుతిన్ గతవారంలో హెచ్చరించాడు. అలాంటి క్షిపణులను ఇచ్చేది లేదని గతంలో ట్రంప్ ప్రకటించాడు. అయితే ఉక్రెయిన్‌లో అమెరికా ప్రత్యేక రాయబారి కెయిత్ కెల్లాగ్ మాట్లాడుతూ ప్రస్తుతం రష్యా మీద దీర్ఘ శ్రేణి లక్ష్యాలపై దాడులను చేసే స్థితిలో ఉక్రెయిన్ ఉందని ట్రంప్ సూచన ప్రాయంగా చెప్పినట్లు తెలిపాడు. తన పాటలకు అనుగుణ్యంగా పుతిన్ నృత్యం చేయటం లేదనే ఉక్రోషంతో ఈ విపరీత చర్య గురించి ఆలోచిస్తున్నట్లు చెప్పవచ్చు. అమెరికా మీడియా క్సియోస్‌తో మాట్లాడిన జెలెన్‌స్కీ తాము కూడా రష్యా ఏది చేస్తే ప్రతిక్రియగా అదే చేస్తామన్నాడు. తమ ఇంధన వనరులపై పుతిన్ సేనలు దాడి చేస్తే తాము కూడా అదే చేస్తామన్నాడు. 650 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాల మీద దాడులు చేయగల డ్రోన్ క్షిపణి వ్యవస్థలను తాము స్వంతంగా తయారు చేసుకున్నట్లు ఉక్రెయిన్ చెప్పింది. అది నిజమో కాదో తెలియదు గానీ నిజమైతే దాని వెనుక నాటో దేశాల హస్తం ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. అంతేగాక, ఫ్లెమింగో పేరుతో తాము మూడువేల కిలోమీటర్ల దూరం ప్రయాణించే క్షిపణిని తయారు చేసినట్లు కూడా కీవ్ చెప్పుకుంది. అంటే పశ్చిమ దేశాల ఆయుధాలకు ఉక్రెయిన్ ముద్ర వేసి రష్యా మీద దాడులకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పవచ్చు. బహుశా వీటిని గమనించి చేసినదే పుతిన్ తాజా హెచ్చరిక.

మరోవైపున ఐరోపా అంతటా ఇటీవల జరుగుతున్న వివిధ రంగాల సమ్మెలను గమనంలోకి తీసుకోవాల్సి ఉంది. ఈ నెలలో అనేక దేశాల్లో విమానాశ్రయాల సిబ్బంది సమ్మెకు పిలుపులు ఇచ్చారు. అందువలన ప్రయాణీకులు ఒకటికి రెండుసార్లు తమ విమానాలు నడిచేదీ లేనిదీ తనిఖీ చేసుకోవాలని ఆ రంగానికి చెందిన సంస్థలు హెచ్చరిస్తున్నాయి. పని పరిస్థితులు, వేతన పెంపుదల వంటి అంశాలు ప్రధానంగా సమ్మెలకు పురికొల్పుతున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల సమ్మెలు, ఇతర రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆగస్టు 15 నుంచి స్పెయిన్‌లోని అనేక విమానాశ్రయాలలో సిబ్బంది ఆందోళన కారణంగా అనేక విమానాలు నిలిచిపోయాయి. ప్రతి బుధ, శుక్ర, శనివారాల్లో విమానాలు దిగేందుకు పని చేసే సిబ్బంది ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు సమ్మెలు చేస్తున్నారు. ఈ ఆందోళన డిసెంబరు 31 వరకు కొనసాగుతుందని ప్రకటించారు. ఫ్రాన్సులో తలెత్తిన రాజకీయ సంక్షోభంతో అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్ నియమించిన ఏడవ ప్రధాని లీకోర్న్ రాజీనామా చేశాడు. కేవలం రెండు సంవత్సరాల్లోనే ఐదుగురు ప్రధానులను నియమించారు. పోర్చుగల్‌లో వచ్చే జనవరి వరకు ప్రకటించిన 71 రోజుల ఆందోళన పిలుపును కోర్టు ఆదేశాల కారణంగా వెనక్కు తీసుకున్నారు. కనీస సిబ్బంది విధుల్లో ఉండాల్సిందే అని కోర్టు ఆదేశించింది. ఇది సమ్మె హక్కుపై నిజమైన దాడి అని కార్మిక సంఘం విమర్శించింది. ఇటలీ రవాణా రంగంలో అనేక అంశాలపై ఒప్పందాలకు రావటంలో విఫలం కావటంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. దీనికి తోడు గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండను నిరసిస్తూ జరిగిన సాధారణ సమ్మెకు కార్మికులు మద్దతు ప్రకటించి లక్షలాది మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

చాలీ చాలని వేతనాలతో బతుకులీడుస్తున్నామని, స్వంత ఇల్లు కొనుగోలు చేసేందుకు అవసరమైన రీతిలో తమ వేతనాలను పెంచాలని బ్రిటన్‌లో రైల్, మారిటైమ్, ట్రాన్స్‌పోర్ట్ (ఆర్.ఎం.టి) యూనియన్ ప్రచార ఆందోళన నిర్వహిస్తున్నది. వేతన పెంపుదలను కోరుతూ రెండు రోజుల పాటు సమ్మె జరపాలని ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్ (టి.ఎఫ్.ఎల్) పిలుపు ఇవ్వగా 4.5 శాతం పెంపుదలకు అంగీకరించటంతో ఆందోళన విరమించారు. కార్మికవర్గం జరుపుతున్న సమ్మెలకు వ్యతిరేకంగా మీడియాలో ఉన్న యాజమాన్య అనుకూల వ్యాఖ్యాతలు వక్రీకరణలతో విశ్లేషణలు రాస్తున్నారు. స్వంత ఇల్లు కొనుగోలు బ్రిటన్‌లో ఒక హక్కుగా లేదన్నది వాటిలో ఒకటి. బ్రిటన్‌లో 1947 నుంచి ప్రతి ఏటా రైల్వే కార్మికులు సమ్మెలు చేస్తున్నారంటూ ఒక వ్యాఖ్యాత ఉక్రోషం వెలిబుచ్చాడు. బడ్జెట్ లోటు ఏర్పడినపుడల్లా ఫ్రాన్సులో ఆ భారాన్ని కార్మికవర్గం మీద నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో జిడిపిలో ఐదు శాతం ఉన్నపుడు 1995లో జరిగిన ఆందోళనల్లో ఇరవై లక్షల మంది రోడ్ల మీదకు వచ్చారు. నాటి ప్రధాని అలైన్ జుపే అంతకు ముందు ప్రతిపాదించిన అనేక పొదుపు చర్యలకు స్వస్తి పలకాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. అధ్యక్షుడు మక్రాన్ 2023లో ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 64 సంవత్సరాలకు పెంచి పెన్షన్ బిల్లును తగ్గించేందుకు చూశాడు. ఇప్పుడు మరో మితవాద ప్రధాని లీకోర్న్ అదే విధానాలతో ఇంటిదారి పట్టాడు. ఐరోపా పాలకవర్గ సంక్షోభం, దానికి కార్మికవర్గం నుంచి ఎదురవుతున్న ప్రతిఘటనకు ఇది ఒక సాక్ష్యం.

కవిత్వం



జలగలు

కళ్ళు మూసి
జెల్ల కొట్టినట్టు
వాత పెట్టి
వెన్న పూసినట్టు
జియ్యస్టీ పేరుతో
గోళ్లూడగొట్టి మరీ...
గుట్టుగా దోచారు
దేశభక్తి అన్నారు
మతం మత్తు జల్లారు
తెప్పరిల్లి చూసేసరికి
ఇల్లు గుల్ల చేశారు
కొనుగోలు శక్తికి
చిల్లు పడేసరికి
దొంగిలించిన వాడే
దానం చేసినట్టు
రాయితీ అన్నారు
పండగ చేసుకోమన్నారు
మాయగాళ్ల భలే
మోసగాళ్ళు కార్పొరేట్ల
కాపుకాయు పాలెగాళ్లు
నయం కాదా...? వీళ్ళకంటే... !
పచ్చి నెత్తురు తాగు జలగలు!

- వి. రాజగోపాల్,
విజయనగరం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

మరుభూమిగా గాజా!

- ప్రతి గంటకూ ఒక చిన్నారి కన్నుమూత
- ప్రతి 33మందిలో ఒకరు మృతి
- ఇజ్రాయిల్ దాష్టీకానికి రెండేళ్లు
- అంతర్జాతీయ ఉదాసీనతకు నిలువెత్తు చిహ్నం



శిధిలాల దిబ్బలే..

గాజా, జెరూసలేం : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు రెండేళ్లు పూర్తయ్యాయి. సుదీర్ఘకాలంగా ఇజ్రాయిల్ మిలటరీ సాగించిన వైమానిక, భూతల దాడుల్లో గాజా స్ట్రిప్ మరుభూమిగా మారింది. ఊళ్ళకు ఊళు శిధిలాల దిబ్బలుగా మారాయి. 67,173మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొన్ని వేలమంది శిధిలాల కింద సజీవ సమాధి అయ్యారు. లక్షల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. వీరిలో మహి ళలు, అభం శుభం తెలియని చిన్నారులు ఎందరో. అంతర్జాతీయంగా ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా, ఎంత ఒత్తిడి ఎదురైనా ఇజ్రాయిల్ తన మొండి, మూర్ఖత్వ వైఖరి విడనాడలేదు. దానికి అమెరికా, మిత్రపక్షాలు ఇచ్చే మద్దతు కూడా తోడైంది... వెరసి రెండేళ్ల కాలంలో గాజాలో పోయిన వారు పోగా వున్న వారు ఆకలితో అలమటిస్తూ.. జీవచ్ఛ వాలుగా మారారు. గాజాలోకి వచ్చే మానవతా సాయం కూడా అందనివ్వ కుండా ఇజ్రాయిల్ సాగించే అమానుష చర్యలతో, ఆంక్షలతో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. అంతర్జాతీయంగా నేతల ఉదాసీనతకు నిలువెత్తు చిహ్నంగా మారింది.

మరుభూమిగా మారిన గాజా

రెండేళ్ల అమానుష దాడుల్లో 67,173మంది మరణించారు. అంటే గాజాలోని ప్రతి 33మందిలో ఒకరు చొప్పున మరణించినట్లైంది. మృతుల్లో దాదాపు 20వేల మంది చిన్నారులు వున్నారు. అంటే దాదాపుగా ప్రతి గంటకు ఒక చిన్నారి మరణించాడు. 1,69,780 మంది గాయపడ్డారు. అంటే గాజాలోని ప్రతి 14మంది లో ఒకరు గాయపడ్డారు. మరికొన్ని వేలమంది శిధిలాల కింద సమాధయ్యారు. 10,800 మందికి పైగా పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ జైళ్లలో దుర్భర పరిస్థితుల్లో మరణిస్తున్నారు. వీరిలో 450మంది చిన్నారులు కాగా, 87మంది మహిళలున్నారు. 3,629మంది ఎలాంటి అభియోగాలు, విచారణ లేకుండా ఆ కూపాల్లో మగ్గుతున్నారు.

92శాతం నివాస భవనాలు నేలమట్టమయ్యాయి. 88శాతం వాణిజ్య సదుపాయాలు ధ్వంసమయ్యాయి. 62శాతం మంది ప్రజలు తమకు సంబంధించిన అన్ని రకాల లీగల్ పత్రాలు పోగొట్టుకున్నారు. 2,300కి పైగా విద్యా సంస్థలు శిధిలాల కుప్పలుగా మారాయి. వీటిలో 63 యూనివర్శిటీ భవనాలు కూడా వున్నాయి. 92శాతం పాఠశాలలు పూర్తిగా పునర్నిర్మాణం చేసుకోవాల్సిందే. దాదాపుగా 1700మంది వైద్య సిబ్బంది మరణించారు. 300మంది మీడియా సిబ్బంది విధి నిర్వహణలో వుంటూ ఈ దాడుల్లో మరణించారు. మంగళవారం కూడా గాజాలో దాడులు కొనసాగాయి. దాడులను తక్షణమే ఆపాలంటూ ట్రంప్ పిలుపిచ్చిన శుక్రవారం నుండి ఇప్పటివరకు 104 మంది మరణించారు.

సిగ్గుతో తలవంచుకోవాలి

గాజాలో ప్రస్తుతం నెలకొన్న బీభత్సమైన, దయనీయమైన పరిస్థితులకు అంతర్జాతీయ సమాజం సిగ్గుతో తలవంచుకోవాలని హమాస్ విమర్శించింది. ఇజ్రాయిల్ ఇంతలా రెచ్చిపోయి మారణకాండను సృష్టిస్తున్నా ప్రపంచ దేశాలు మౌనంగా, ఉదాసీనంగా వ్యవహరించాయని విమర్శించింది. ఇజ్రాయిల్‌లో కూడా ప్రధాని నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బందీలను విడిపించడంలో, యుద్ధాన్ని ఆపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దారుణమైన రీతిలో మిలటరీ ఆపరేషన్లు, అమెరికా నుండి అడ్డూ అదుపు లేని రీతిలో మద్దతు వున్నా వారి లక్ష్యాన్ని నెరవేరనివ్వబోమని హమాస్ ప్రతినిధి బర్హొమ్ స్పష్టం చేశారు.

జర్మనీలో కొత్తగా ఎన్నికైన మేయర్‌కు కత్తిపోట్లు



బెర్లిన్ : జర్మనీలో ఒక పట్టణానికి మేయర్‌గా ఎన్నికైన మహిళ కత్తిపోట్లకు గురికావడం ఆ దేశంలో సంచలనం సృష్టించింది. పశ్చిమ జర్మనీలోని హెర్డెక్కె పట్టణ మేయర్‌గా ఐరిస్ స్టాల్జర్ గత నెల 28న ఎన్నికయ్యారు. ఆమె జర్మనీ ప్రభుత్వంలో జూనియర్ పార్టీ అయిన సెంటర్ - లెఫ్ట్ సోషల్ డెమొక్రాట్స్ సభ్యురాలు. ఐరిస్ స్టాల్జర్‌ను మంగళవారం ఆమె అపార్ట్‌మెంట్‌లోనే తీవ్రగాయాలతో గుర్తించారు. వెంటనే రెస్క్యూ హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తీవ్రంగా స్పందించారు. ఇది ఒక హేయమైన చర్యగా విమర్శించారు. ఐరిస్ స్టాల్జర్ పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాయ్‌బరేలిలో మూక హత్య

- దళితుడిని కొట్టిచంపిన గ్రామస్తులు

రాయ్‌బరేలి : ఉత్తరప్రదేశ్ యోగి అదిత్యనాథ్ పాలనలో మరో దారుణం జరిగింది. రాష్ట్రంలోని రాయ్‌బరేలి జిల్లాలో 40 ఏళ్ల దళిత వ్యక్తిని కొంతమంది గ్రామస్తులు దారుణంగా కొట్టి చంపారు. జిల్లాలోని ఉంచహర్ నగర పంచాయతీలో ఈ నెల 1 రాత్రి జరిగిన ఈ మూక దాడికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో దళిత వ్యక్తిని గ్రామస్తులు తీవ్రంగా కొడుతున్న దృశ్యం స్పష్టంగా ఉంది. దీంతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో మరణించిన దళితుడిని హరిఓం వాల్మీకిగా గుర్తించారు. ఈ ఘటన గురించి జిల్లా ఎఎస్‌పి సంజీవ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ ఈ నెల 2 ఉదయం ఉంచహర్‌లోని రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఒకరి మృతదేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. తదుపరి విచారణలో దొంగగా అనుమానించి కొంతమంది కొట్టిచంపినట్లు వెల్లడయిందని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఇప్పటి వరకూ ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేశామని తెలిపారు. మిగిలిన నిందితులను పట్టుకోవడానికి తనిఖీలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సబ్ ఇన్‌స్పెక్టర్‌తో సహా ముగ్గురు పోలీసుల్ని రాష్ట్ర డిజిపి సస్పెండ్ చేశారు.

రాజ్యాంగంపై, దళితులపై దాడి : తీవ్రంగా ఖండించిన రాహుల్‌గాంధీ

ఈ మూకహత్యను రాయ్‌బరేలి ఎంపి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూకదాడిని దేశ రాజ్యాంగంపై, దళితులపై జరిగిన నేరంగా విమర్శించారు. ప్రస్తుతం దేశంలో దళితులు, గిరిజనులు, ముస్లింలు, బిసిలు, పేదలు లక్ష్యంగా మారారని, విద్వేషం, హింస, మూకదాడులు అధికారాన్ని అనుభవిస్తున్నాయని విమర్శించారు. హరిఓం వాల్మీకి కుటుంబాన్ని రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ పరామర్శించారు.

17కు దగ్గు మందు మరణాలు

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో నకిలీ దగ్గు మందు తాగి మరణించిన చిన్నారుల సంఖ్య మంగళవారానికి 17కు చేరుకుంది. సోమవారం రాత్రి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చికిత్స పొందుతున్న ఏడుగురిలో ఒకరు మృతి చెందగా, మంగళవారం ఇద్దరు మృతి చెందారు. ఈ వివరాలను చింద్వారా అదనపు కలెక్టర్ ధీరేంద్ర సింగ్ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో వివిధ ఆసుపత్రుల్లో చింద్వారాకు చెందిన నలుగురు, బేతుల్ జిల్లాకు చెందిన ఐదుగురు చిన్నారులు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కోల్డ్రిఫ్ సిరప్ అనే దగ్గు మందు తాగడంతో చిన్నారులు మూత్రపిండాల సమస్యలకు గురైన మృతువాత పడుతున్న నివేదికలు వస్తున్నాయి. ఇందులో తొలి మరణం సెప్టెంబర్ 2న సంభవించింది. ఇప్పటికే చింద్వారాలోని పరాసియాలో ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్ సోనిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్తాన్‌లో కూడా ఇద్దరు చిన్నారులు మరణించినట్లు సమాచారం.

న్యాయ విచారణకు కాంగ్రెస్ డిమాండ్

మధ్యప్రదేశ్, రాజస్తాన్‌ల్లో నకిలీ దగ్గు మందుతో చిన్నారులు మరణించడంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించాలని కోరింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాజస్తాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీల్లో ప్రతిపక్ష నాయకులు తికా రామ్ జుల్లీ, ఉమాంగ్ సింఘర్ మాట్లాడారు. ఈ మందులో చిన్నారుల మూత్రపిండాలకు హాని చేసే డైథిలిన్ గ్లైకాల్ (డిఇజి) అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు గుర్తించారని, గతంలో జమ్మూకాశ్మీర్, గాంబియా, ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన మరణాలకు ఇదే పదార్థం కారణమని కనుగొన్నారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్ ప్రభుత్వాలు చిన్నారుల మృతికి కారణమైన దగ్గు మందు తయారీ కంపెనీలకు క్లిన్ చిట్ ఇస్తున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 16 మంది చిన్నారులు మరణించినా సిఎం స్పందించలేదన్నారు. ఉపముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా ఆ కంపెనీకి క్లీన్‌చిట్ ఇస్తున్నారని, ఆ కంపెనీతో ఉన్న ఆయనకున్న సంబంధం ఏమిటని సింఘర్ ప్రశ్నించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్

మధ్యప్రదేశ్‌లో కఫ్ సిరప్ మరణాలపై దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలైంది. జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని పిటిషన్ పేర్కొంది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎఫ్ఐఆర్‌లను సిబిఐకి బదిలీ చేయాలని కూడా కోరారు. పరిశ్రమల్లో వినియోగించే విషపూరిత రసాయనం డైథిలిన్ గ్లైకాల్ కలిగిన దగ్గు సిరప్‌ల తయారీ, నియంత్రణ, పరీక్ష, పంపిణీపై సమగ్ర విచారణ చేపట్టాలని, మెడిసిన్ తయారీకి సూచనలను జారీ చేయాలని కోరింది. నిషేధానికి గురైన కోల్డ్రిఫ్ సిరప్ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని, వాటి విక్రయాలు, పంపిణీ జరగకుండా అడ్డుకోవాలని సుప్రీంకోర్టును కోరింది.

రాజ్యాంగం, దేశంపై దాడి

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని రాజ్యాంగం, దేశంపై జరిగిన దాడిగా చూడాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ తెలిపారు. గురువారం నాడిక్కడ జరిగిన అంగన్వాడీ అఖిల భారత సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ సిజెఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఘటన ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా ఆయన పేర్కొన్నారు. సిజెఐగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మహారాష్ట్ర పర్యటనకు గవాయి వెళ్లినప్పుడే ఫోటోకాల్ పాటించకుండా బిజెపి ప్రభుత్వం అవమాన పరిచిందని గుర్తు చేశారు. అప్పుడే బిజెపి నేతలపై చర్యలు తీసుకొని ఉంటే తాజా ఘటన జరిగేది కాదని అన్నారు. యావత్ సమాజం ఈ దాడిని ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో మనువాదాన్ని, మతోన్మాద శక్తులను ఎదిరించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

హర్యానా సీనియర్ ఐపిఎస్ అధికారి ఆత్మహత్య



రాయ్‌పూర్ : హర్యానా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు పురాన్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్‌లోని సెక్టార్ 11లోని తన నివాసంలో తన గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై విచారణ జరుగుతోందని, స్థానిక పోలీసు అధికారులు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ (సిఎఫ్ఎస్-ఎల్) బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తోందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కున్వర్‌దీప్ కౌర్ తెలిపారు.

2001 బ్యాచ్ అధికారి అయిన పురాన్‌కుమార్ రోహతక్‌లోని సునారియాలోని పోలీస్ శిక్షణా కేంద్రం (పిటిసి)లో నియమితులయ్యారు. ఆయన భార్య అమన్ ఐఎఎస్ అధికారి. ఆమె ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నారు. బుధవారం సాయంత్రం భారత్‌కు తిరిగి రానున్నారు.

నేషనల్ గార్డ్స్ గో బ్యాక్

- చికాగోలో భారీ నిరసనలు..
- రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించిన పోలీసులు



చికాగోలో నేషనల్ గార్డ్స్ సైనికులను మోహరించడానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

చికాగో : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతి భద్రతల రక్షణ పేరుతో నేషనల్ గార్డ్ సైనికులను చికాగోకు పంపారు. దీన్ని వ్యతిరేకిస్తూ సోమవారం రాత్రి ఐసిఇ కార్యాలయం వద్ద ఆందోళనకారులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నేషనల్ గార్డ్స్ గో బ్యాక్ అంటూ నినదించారు. పోలీసులు నిరసనకారులపై రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయివు గోళాలు ప్రయోగించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు.. గవర్నర్, మేయర్‌లతో సంప్రదించకుండా, వారి ఆమోదం లేకుండా ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు.

మిలటరీ దాడిలా ఉంది : ఇల్లినాయిస్ గవర్నర్

ఇల్లినాయిస్ రాష్ట్ర గవర్నర్ జెబి ప్రిట్జ్కర్ ఈ చర్యలను ఖండించారు. "ఇది మిలటరీ దాడిలా ఉంది, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలను ఉగ్రవాదులుగా చూపించే ప్రయత్నం" అని ఆయన విమర్శించారు. నేషనల్ గార్డ్స్‌ను పంపడాన్ని రాష్ట్రాల అధికారంపై దాడి అని పేర్కొన్నారు. చికాగో మేయర్ బ్రాండన్ జాన్సన్ చికాగోను ఫ్రీ జోన్‌గా ప్రకటించారు. ఐసిఇ సిబ్బందికి ప్రభుత్వం కల్పిస్తున్న నిధులు, సౌకర్యాలపై ఆంక్షలు విధించారు. డెమొక్రాట్ల పాలనలో ఉన్న నగరాలపై ఉద్దేశపూర్వకంగానే ట్రంప్ దళాలను పంపిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై చట్టపరంగా కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్రాల అనుమతి లేకుండా నేషనల్ గార్డ్స్‌ను పంపే అధికారం ట్రంప్‌కు లేదని పలువురు కోర్టుకు వెళ్లారు. మరోవైపు కేంద్రం తమకు సమాఖ్య ప్రాంతాలను రక్షించే అధికారం ఉందంటూ సమర్ధించుకుంటుంది.

కొద్ది రోజుల క్రితం అధ్యక్షుడు ట్రంప్ చికాగో నగరాన్ని హత్యల నగరంగా, నేరాల రాజధానిగా అభివర్ణించిన సంగతి తెలిసిందే. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) నివేదిక ప్రకారం 2023వ సంవత్సరం నుండి నేరాల రేటు 11% తగ్గింది. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, వాషింగ్టన్ నగరాల్లో నేరాలు అధికంగా ఉన్నాయని ఎఫ్‌బిఐ డేటా తెలుపుతుంది. అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలతో ఇప్పటికే అమెరికా షట్‌డౌన్‌లో ఉందని, రాజ్యాంగ వ్యతిరేకంగా దేశ నగర వీధుల్లో సైనికుల మోహరింపు ద్వారా రాజకీయ సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

● ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆళ్లగడ్డ-మైదుకూరు రూట్‌లో దువ్వూరు సమీపంలో ఆర్‌టిసి అద్దెబస్సు డ్రైవర్‌పై దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘ వ్యతిరేఖ శక్తిని తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గాయాలపాలైన డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని డ్రైవర్‌పై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ పేర్కొంది.

ప్రేమ వివాహం చేసుకున్నాడని హత్య

● గుంటూరులో చెల్లెలు భర్తను చంపిన సోదరుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తన సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడనే అక్కసుతో బావను దారుణంగా హత్య చేసిన ఘటన పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు తూర్పు మండలం బుడంపాడు గ్రామానికి చెందిన గణేశ్ (24) తన బంధువులతో కలిసి కొలకలూరులో ఓ వివాహ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఆ సమయంలో వీరాంజనేయదేవిని వివాహం చేసుకోమని గణేష్‌కు బంధువులు సూచించారు. ఆ తరువాత పెద్దల మధ్య సంప్రదింపులు జరిగాయి. వీరాంజనేయదేవిని వివాహం చేసుకునేందుకు గణేష్ ఇష్టపడడ్డాన్ని ఆమె సోదరులు వ్యతిరేకించారు. కొద్ది కాలం తర్వాత వారిద్దరూ ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. రక్షణ కోరుతూ నల్లపాడు పోలీసులను కోరారు. ఇద్దరూ మేజర్లు కనుక వివాహం జరిగిపోయిందని, వారి జోలికి వెళ్లవద్దని పెద్దలకు పోలీసులు సూచించారు. రహస్యంగా వివాహం చేసుకోవడం ఏమిటని బంధువులందరిని పిలిచి భారీ ఫంక్షన్ ఏర్పాటు చేసుకునేందుకు ఇరువురు తల్లిదండ్రులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనేపథ్యంలో వీరాంజనేయదేవి సోదరుడు కీర్తి దుర్గారావు మంగళవారం బుడంపాడు నుంచి గుంటూరు వస్తున్న గణేశ్‌ను కత్తితో పొడిచి హత్య చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులు జాప్యమైతే వడ్డీ

● మార్గదర్శకాల్లో మార్పులుచేసిన ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందించే పింఛన్లు, గ్రాట్యుటీ వంటి చెల్లింపుల్లో జాప్యం జరిగితే ఆ పరిహారం మొత్తంపై వడ్డీని కూడా చెల్లించే విధంగా నిబంధనల్లో మార్పులు చేస్తూ ఆర్థికశాఖ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది.ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యంపై వడ్డీని ఆర్థికశాఖ అనుమతులతోనే చెల్లించనున్నట్లు వెల్లడించింది. చెల్లింపులకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు, కోర్టు కేసులు ఉంటే, అవి కొలిక్కి వచ్చిన నాటి నుంచి జాప్యాన్ని గణించనున్నట్లు పేర్కొంది. అలాగే చెల్లింపుల్లో జాప్యానికి నిర్వహణపరమైన తప్పిదాలు ఉంటేనే వడ్డీ చెల్లింపులు వర్తిస్తాయి. ఇదే సమయంలో జాప్యానికి కారణమైన అధికారులు, ఉద్యోగులను బాధ్యులను చేస్తూ వారిపైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఒక ఉద్యోగి పదవి విరమణ చేయడానికి 18 నెలల ముందుగానే అతనికి సంబంధించిన పింఛను పత్రాలను ఆయా శాఖల అధికారులు సిద్ధంచేసి, వాటిని నిర్దిష్ట ప్రొఫార్మాలో పంపించాలని నిర్దేశించింది. అలాగే నిర్దిష్ట కాల పరిమితిలో ఆ పత్రాలను అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి కూడా పంపించాలని పేర్కొంది.

శ్రీకాకుళం జిల్లాలో 16 మండలాల్లో పంట నష్టం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భారీ వర్షాల కారణంగా శ్రీకాకుళం జిల్లాలో 16 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మండల అధికారులతో పలు శాఖల పురోగతిపై మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా సంతబొమ్మాళిలో వెయ్యి ఎకరాలు, పాతపట్నంలో 625 ఎకరాలు, కొత్తూరు, హిరమండలంలో 250 ఎకరాల చొప్పున పంట నష్టం వాటిల్లిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం మొలకెత్తడం, పొట్ట దశలో వరి పొలాల్లో నీరు చేరడం, పూత వాష్ అవుట్ అవ్వడం వంటి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట నష్టంపై తక్షణమే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామని, పంట నమోదు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆరు గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రంలో జలాశయాలను నిండుకుండల్లగా మారాయి. ఎగువన ఉన్న తెలంగాణ పరిధిలోని జూరాల నుండి, విద్యుత్ ఉత్పాదన, గేట్ల ద్వారా నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి కొనసాగుతోంది. శ్రీశైలం ఆనకట్ట నుండి ఆరు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు 68,174 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుండి 1,14, 668 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 8,892 క్యూసెక్కులు, హంద్రీ నుండి 250 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరింది. జలా శయానికి 1,23,810 క్యూసెక్కుల నీరు చేరుతున్నాయి. రెండు విద్యుత్తు కేంద్రాలలో యథావిధిగా విద్యుత్ ఉత్పాదనను కొనసాగిస్తున్నారు.

నకిలీ మద్యం కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ ● మద్యం సీసాలను పగులగొట్టి మహిళల నిరసన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

నకిలీ మద్యం కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం అండతో నకిలీ మద్యం అక్రమ దందా సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ, కల్తీ మద్యం కుంభకోణంపై న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఈ ప్రాంతవాసులకు బూడిద కలిసిన నీరు కాకుండా స్వచ్ఛమైన మంచినీరు అందించాలని కోరుతూ మంగళవారం ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మద్యం సీసాలను పగలగొట్టి మహిళలు నిరసన తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వ తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ, కల్తీ మద్యం తయారు చేసిన గోడౌన్ ప్రాంతాన్ని బాబురావుతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి కాజ సరోజ, సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి మహేష్ , సీనియర్ నేత విఠల్ రావు తదితరులు పరిశీలించారు. ఈసందర్భంగా బాబురావు, నేతలు మాట్లాడుతూ... ములకలచెరువు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో నకిలీ మద్యం రాకెట్ బట్టబయలైందన్నారు. టిడిపి కూటమిపాలనలో గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు దొరకటం లేదని, కల్తీ మద్యం మాత్రం ఏరులై పారుతోందని విమర్శించారు.



ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మద్యం బాటిళ్లు పగొలగొట్టి నిరసన తెలుపుతున్న సిపిఎం, ఐద్వా, సిఐటియు నేతలు సిహెచ్.బాబురావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, కె.సరోజ తదితరులు

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

● కమిషనర్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి : తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో పారిశుధ్యం, తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఒక్క అనారోగ్యం కేసు ఉన్నా అత్యవసర కేసుగా గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. తురకపాలెంను ఆమె మంగళవారం సందర్శించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చివరి దశలో ప్రభుత్వాస్పత్రికి రావడం సరికాదన్నారు. తొలి దశలోనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో వ్యాధుల గురించి మీడియాలో ఎక్కువగా ప్రచారం జరగడం వల్ల తమ గ్రామానికి బంధువులు, చిరు వ్యాపారులు రావడంలేదన్నారు. మీడియాలో అధికారులు వాస్తవాలు తెలియజేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ అసాధారణ మరణాలు నమోదయిన ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

మురుగు నీరు ఎక్కడా నిలువ ఉండరాదన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పరిస్థితులు పూర్తిగా నియంత్రణలోకి వచ్చే వరకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామంలో 102 మందికి బిపి, 69 మందికి మధుమేహం ఉన్నట్లు వైద్య సిబ్బంది సర్వేలో గుర్తించామని తెలిపారు. తహశీల్దార్ ప్రతి రోజూ గ్రామంలో పర్యటించాలని ఆదేశించారు. ఆశా, ఎఎన్ఎం ప్రతి గహానికి సంబంధించిన సమాచారం కలిగి ఉండాలని చెప్పారు.

ప్రణాళికాయుతంగా వ్యర్థాల నిర్వహణ

● కమిషనర్ల వర్కుషాప్‌లో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పురపాలక సంస్థల పరిధిలో ఘన, ద్రవ వ్యర్థాలు, డ్రైనేజీ. రోడ్లు, వీధిదీపాల నిర్వహణ పక్కా ప్రణాళికాయుతంగా చేపట్టాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కార్యాలయంలో కమిషనర్ల మూడు రోజుల వర్కుషాప్‌కు మంగళవారం నాడు మంత్రి హాజరయ్యారు. తొలి రోజు 29 మంది కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, డిసెంబర్ ఆఖరు కల్లా మరో 20 లక్షల టన్నులు తొలగిస్తామని చెప్పారు. ప్రస్తుతం రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయని, మరో 6 త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. మురుగునీటితో పాటు వర్షపునీటి నిర్వహణకు కాలువలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమృత్ పథకం-2 ద్వారా మున్సిపాలిటీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. ఎఐఐబి, యుఎఫ్ఐడి నిధుల ద్వారా తాగునీరు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతున్నామని తెలిపారు. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వందశాతం పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను ప్రతి శనివారం లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, టిడ్కో ఎమ్‌డి సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

మైనార్టీలకు రూ.41.37 కోట్ల లబ్ధి : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకంలో భాగంగా మైనార్టీ వర్గాలకు చెందిన డ్రైవర్లకు రూ.41.37 కోట్ల మేర లబ్ధి చేకూరిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 27,580 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 3,977 మందికి, బిసి కార్పొరేషన్ ద్వారా (బిసి-ఇ) 22,975 మందికి 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకంలో భాగంగా ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలి

● సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు భూములు ఇవ్వడానికి ప్రభుత్వానికి హక్కు ఎవరిచ్చారని, ఈ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ 79 శాతం ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిందని ముఖ్యమంత్రి అబద్ధం చెప్పారని వివరించారు. అల్లూరి జిల్లా అరకులోయ మండల కేంద్రంలోని టిటిడి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనులు తిరగబడుతున్నారని, ఎక్కడ మీటింగ్ పెట్టినా వేలాది సంఖ్యలో కదులుతున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రద్దు చేయకపోతే భవిష్యత్తులో గిరిజనులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే టూరిజం నడవాలని, దాని ద్వారా ఉపాధి పెరుగుతుందని అన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పేదల పొట్టలు కొడతారని, ఉద్యోగాలు, పర్మినెంట్ ఉండదని తెలిపారు. రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వాలు గత 25 ఏళ్లుగా నిర్మించిన గెస్ట్ హౌస్‌లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అడవులు, భూములను రక్షించేది గిరిజనులని, అడవిని, ఆ భూములను ప్రైవేటుపరం చేస్తామంటే వారు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. గిరిజనుల పక్షాన కార్మిక వర్గం ఉంటుందని, నిరంతరం పోరాడుతుందని అన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు జీవితమంతా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగానే పని చేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయడం లేదని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో వివిధ శాఖల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు, స్కీం వర్కర్లను ఎందుకు రెగ్యులరైజేషన్ చేయట్లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో లక్షల మంది కార్మికులు ఉన్నారని, వీరి కోసం ఇఎస్ఐ ఆస్పత్రి పెట్టడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అబద్ధాలతో స్టీల్‌ప్లాంట్ కార్మికులను మోసగిస్తున్నారని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లాంట్‌లో సుమారు ఏడు వేల మంది ఉద్యోగులు, కార్మికులు తొలగించబడ్డారని, కార్మికులను తొలగిస్తే ఉత్పత్తి ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రీతి బాయి కేసును సిబిఐకి అప్పగించాలి

● ప్రీతి బాయి తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సుగాలి ప్రీతి బాయి కేసును సిబిఐకి అప్పగించాలని ప్రీతి బాయి మతురాలి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్ అన్నారు. మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ సుగాలి ప్రీతి బాయ్ మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని 8 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న న్యాయం చేకూరడం లేదన్నారు. అధికారంలో కి రాకముందు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వద్దకు చిత్తు పేపర్ను తీసుకువచ్చిన స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సుగాలి ప్రీతి మృతి పట్ల గొంతు చించుకుని మాట్లాడిన ఆయన నేడు గొంతు మూగబోయిందన్నారు. అసెంబ్లీలో ఏ ఒక్కరు కనీసం స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. అధికారం ఉండి కూడా చొరవ చూపకపోవడం తనను బాధించిందన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో ప్రధానమంత్రితో కలిసి సమస్యను విన్నవించుకునేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి యాన్యువల్ రిపోర్టు గవర్నర్‌కు అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిపిఎస్‌సి ఛైర్మన్ అనూరాధ, మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎపిపిఎస్‌సి యాన్యువల్ రిపోర్టు 2024-25ను ఆమె గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎపిపిఎస్‌సికి సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.

రాజధాని కోసం మూడో వ్యవస్థ

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో పాటు ఎనిమిది ప్రాజెక్టులు అప్పగింత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం కోసం మరో సంస్థను ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు పలు ప్రాజెక్టులను ఈ సంస్థ చేపట్టనుంది. ఈ మేరకు మంగళవారం పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, ఆర్థిక అంశాలు, అప్పులు, చెల్లింపులతోపాటు ఇతర అంశాలన్నిటనీ ఇది పర్యవేక్షించనుంది. కంపెనీ చట్టం కింద ఏర్పాటు చేసే ఈ సంస్థకు పది లక్షల షేర్లను ఒక్కోటి రూ.10 చొప్పున కేటాయించారు. బోర్డు డైరెక్టర్లు నిర్ణయం మేరకు ఈ ధర పెరుగుదల ఉండదనుంది. ఇప్పటికే రాజధాని కోసం ఏర్పాటు చేసిన ఎపి సిఆర్‌డిఏతోపాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా ఉంది. ఇవి కాకుండా వేర్వేరు పేర్లతో సుమారు 14 కంపెనీలు రిజిస్టరయి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో పాటు ఎన్‌టిఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్‌సిటీ, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, రోప్‌వే, ఇన్నర్ రింగురోడ్డు, కొత్తగా గుర్తించే ఇతర ప్రాజెక్టులను దీని ద్వారా చేపట్టనున్నారు. దీనిలో పట్టణాభివృద్ధిశాఖ, ఆర్థికశాఖ, విద్యుత్, ఆర్‌అండ్‌బి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శులతోపాటు ఎపి సిఆర్‌డిఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. అనంతరం ముగ్గురు ఇండిపెండెంట్ డైరెక్టర్లను ఎన్నుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు అవసరమైన నిధులు సమకూర్చడం తోపాటు భూములు తనఖా పెట్టుకునే హక్కును కూడా ఇచ్చారు. అలాగే యూజం ఛార్జీలు వసూలుకూ అవకాశం కల్పించారు.

కొత్తగా ఏర్పాటయ్యే సంస్థ బాధ్యతలు

కొత్త ప్రాజెక్టులకు నిధుల సేకరణతోపాటు అవసరమైన ప్రాజెక్టులు రూపొందించి వాటికి డిపిఆర్‌లు తయారు చేయనుంది. పిపిపి, ఈపిసి, హెచ్ఎఎం వంటి పద్ధతుల్లో కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతలను అప్పగించనుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులను అమలు చేసేందుకు వీలుగా పత్రాలు తయారు చేసే బాధ్యతనూ నిర్వర్తించనుంది. పిపిపి పద్ధతిలో ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ప్రణాళికనూ తయారు చేయనుంది. ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా కార్పొరేట్ సంస్థలనూ ఎంపిక చేసుకునే అవకాశమూ కొత్తగా ఏర్పాటు చేసుకునే సంస్థకు ఇచ్చారు.

భూసేకరణ నుండి 343 ఎకరాల ఉపసంహరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో గతంలో భూసేకరణ ప్రకటన విడుదల చేసిన 343.36 సెంట్ల భూమికి గతంలో ఇచ్చిన సేకరణ నోటిఫికేషన్ రద్దు చేశారు. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో సుమారు 1500 ఎకరాలకు సేకరణ నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులో సుమారు 1200 ఎకరాలను గత వైసిపి ప్రభుత్వం డీనోటిఫై చేసింది. అప్పటికే రోడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టిన 343.36 ఎకరాలు అలాగే పెండింగ్‌లో ఉంది. దీనిపై హైకోర్టులోనూ కేసులు నడుస్తున్నాయి. దీంతో అడ్వకేట్ జనరల్ సూచన మేరకు గతంలో నోటిఫికేషన్ కింద ఉన్న భూములను వాటి నుండి తొలగించేందుకు పాత నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. అదే సమయంలో కొత్తగా వాటిని తీసుకునేందుకు వీలుగా గుంటూరు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్‌కు అధికారాలిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో 343.36 ఎకరాల భూమిని సేకరించి తమకు ఇవ్వాలని కోరుతూ సిఆర్‌డిఏ కమిషనర్ గుంటూరు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయనున్నారు. దీని ఆధారంగా కొత్త నోటిఫికేషన్ అమల్లోకి వస్తుంది. గతంలో వైసిపి ప్రభుత్వం డీనోటిఫై చేసిన సమయంలో అప్పటి అధికారులు తాము భూసేకరణ చేస్తామంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై భూ యజమానులు అప్పటికే కేసులు దాఖలు చేసి ఉండటంతో వారి సమాధానాలు కోరారు. దీనిపై సేకరణ ప్రకటన కింద ఉన్న భూముల యజమానులు హైకోర్టులో వారి సమాధానం దాఖలు చేశారు. తమ భూములు సేకరించుకుంటామంటే 11 ఏళ్ల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. దీనిపై సిఆర్‌డిఏ అధికారులను ప్రతిస్పందన కోరగా ఇప్పటి వరకూ సమాధానం ఇవ్వలేదు. అలాగే ఉన్నం మురళీ అనే వ్యక్తి వైసిపి ప్రభుత్వం డీనోటిఫై చేసిన భూమిని సేకరణ పద్ధతిలో తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.



హిమాచల్‌లో ఘోర ప్రమాదం

- టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు
- 18 మంది మృతి
- కొనసాగుతున్న సహాయక చర్యలు

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పుర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఒక టూరిస్టు బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో బస్సులో 30 నుంచి 35మంది ఉన్నట్టు సమాచారం. వారిలో ముగ్గుర్ని రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రెస్క్యూ సిబ్బంది రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. హర్యానాలోని రోహ్‌తక్ నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని ఘుమర్విన్‌కు ఈ ప్రయివేటు టూరిస్టు బస్సు బయలుదేరింది. ఝుండూతా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బలూఘాట్ ప్రాంతానికి మంగళవారం రాత్రి చేరుకోగానే కొండచరియలు విరిగి బస్సుపై పడ్డాయి. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన బృందాలు శిథిలాల్లో చిక్కుకున్న పలువురిని ప్రాణాలతో బయటకు తీశాయి. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికీ రూ 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారాన్ని ప్రధాని ప్రకటించారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, జెపి నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరం, దురదృష్టకరమని తెలిపారు.

కరూర్ తొక్కిసలాటపై 10న సుప్రీం విచారణ



న్యూఢిల్లీ : తమిళగ వెట్రి కళగం (టివికె) చీఫ్, సినీ నటుడు విజయ్ గతనెల 27న నిర్వహించిన ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించేందుకు మద్రాసు హైకోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 10న సుప్రీం కోర్టు విచారించనుంది. ఈ విషాదంలో 41మంది మరణించగా, 60మందికి పైగా గాయపడ్డారు. బిజెపి నేత ఉమా ఆనందన్ ఈ పిటిషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ముందు పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, సిబిఐ దర్యాప్తు కోసం చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు జరిగిన తీరుతో తాను సంతృప్తి చెందలేదని సింగిల్ జడ్జి ఒకరు వ్యాఖ్యానించారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ శుక్రవారం విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

బాధితుల కుటుంబాలతో విజయ్ వీడియో కాల్స్

కరూర్ ఘటనలోని బాధితుల కుటుంబాలకు టివికె చీఫ్ విజయ్ మంగళవారం వీడియోకాల్స్ చేసి మాట్లాడారు. అయినవారిని పోగొట్టుకున్న వారిని పరామర్శించారు. ఈ కాల్స్‌ను రికార్డు చేయవద్దని లేదా ఫోటోలు తీయవద్దని పార్టీ కార్యకర్తల బృందం బాధితుల కుటుంబాలను కోరింది.

ఈ విషాదంలో భార్య, కుమార్తెలను పోగొట్టుకున్న శక్తివేల్ కుటుంబంతో విజయ్ మాట్లాడారు. అనంతరం శక్తివేల్ మీడియాతో మాట్లాడుతూ రెండు నిముషాలపాటు విజయ్ మాట్లాడారని, ఈ నష్టం భరించలేనిదని అంటూ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారన్నారు. తనకేదైనా అవసరమైతే తర్వాత విజయ్ వచ్చినపుడు చెప్పాలని ఆ తర్వాత పార్టీ కార్యకర్తలు తనకు చెప్పారన్నారు. విజయ్ ఇంకా మరికొంత మంది కుటుంబాలతో మాట్లాడారు.

9కి చేర్పులు, తొలగింపుల వివరాలివ్వండి

- బీహార్‌లో ఎస్‌ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తుది ఓటర్ల జాబితాలో చేర్చిన, తొలగించిన పేర్ల గురించి పారదర్శకంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నెల 9 నాటికి పూర్తి వివరాలను ఇవ్వాలని పేర్కొంది. బీహార్‌లోని ఎస్‌ఐఆర్‌పై పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. తుది జాబితాలో చేర్చిన పేర్లు ముసాయిదా జాబితా నుండి తొలగించినవా? కాదా? అనే దానిపై గందరగోళం ఉందని పేర్కొంది. వారి అప్పీల్ హక్కుకు సహాయం చేయడానికి ఇసి వ్యక్తిగతంగా ఓటర్లను మినహాయించిందా? అని ప్రశ్నించింది. మినహాయింపుల గురించి ఇంకా ఫిర్యాదులు లేవని ఇసి తెలిపింది. "పారదర్శకత, సమాచారం ప్రజాస్వామ్యానికి ముఖ్య లక్షణాలు" అని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఎస్‌ఐఆర్ తరువాత బీహార్ తుది జాబితాలో చేర్చబడిన ఓటర్ల వ్యక్తిగత వివరాల గురించి ఇసిని ప్రశ్నించింది. "తుది జాబితాలో చేర్చిన పేర్ల గురించి గందరగోళం ఉంది. చేర్చిన వ్యక్తుల గుర్తింపు ఏమిటి? ఇది డ్రాఫ్ట్ రోల్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల నుండి తీసుకోబడిన పేర్లా? కొత్త పేర్లా? లేక యాడ్ అయిన పేర్లా? " అని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి ప్రశ్నించారు. తుది జాబితా రాష్ట్రంలో 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని చూపిస్తుంది. ఎస్‌ఐఆర్ తర్వాత ప్రచురించిన ముసాయిదా ఓటర్ల



జాబితాలోని 7.24 కోట్ల ఓటర్ల కంటే ఇది ఎక్కువ. బీహార్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ నోటిఫికేషన్ తేదీ జూన్ 24న 65 లక్షల పేర్లను తొలగించారు. తుది జాబితా నుండి తొలగించిన 3.66 లక్షల మందికి సంబంధించి అప్పీళ్లు దాఖలు చేయడానికి వీలుగా తగిన అధికారిక తొలగింపు ఉత్తర్వులతో వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారా? అని ఇసిని కోర్టు ప్రశ్నించింది. "వారికి అప్పీల్ చేసుకునే హక్కు ఉంది" అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి మినహాయించిన 3.66 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలతో కూడిన ప్రత్యేక జాబితాను ప్రచురించారా? వాటిని అట్టడుగు స్థాయిలో సులభంగా అందుబాటులో ఉంచారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. జిల్లా ఎన్నికల కార్యాలయాల నోటీసు బోర్డులపై తొలగించిన ఓటర్ల పేర్లు, వివరాలను ప్రదర్శించాలని కోరుతూ 1960 ఓటర్ల నమోదు నియమాల్లోని నిబంధన 21ఎని జస్టిస్ బాగ్చి ప్రస్తావించారు.

డేటాను ఇప్పటికీ క్షేత్రస్థాయి అధికారుల నుండి సేకరించి ప్రాసెస్ చేస్తున్నట్లు ఈసి తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ లిఖితపూర్వక వాదనలలో ఇప్పటికే లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలని ఇసిని ధర్మాసనం ఆదేశించింది.

వయోజనుల్లో 10 శాతం మందికి ఓటు హక్కు నిరాకరణ

2025 సెప్టెంబర్ నాటికి బీహార్‌లో వయోజన జనాభా అధికారిక అంచనా 8.22 కోట్లు అయినప్పటికీ, తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు మాత్రమే అని ప్రశాంత్‌భూషణ్ పేర్కొన్నారు. "ఈ విధంగా, 80 లక్షలు, అంటే, బీహార్‌లోని మొత్తం వయోజన జనాభాలో దాదాపు 10 శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. వయోజన జనాభా - ఓటర్ల నిష్పత్తిలో ఇంత తగ్గుదల దేశానికి, బీహార్‌కు రికార్డు" అని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంతకు ముందు 10 శాతం మంది ఓటర్లు జాబితా నుండి తొలగించబడలేదని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఓటర్ల జాబితా నుండి లక్షలాది మంది మహిళలు 'తప్పిపోయారని' అన్నారు. "ఎస్‌ఐఆర్ తరువాత బీహార్‌లో లింగ నిష్పత్తి సెప్టెంబర్ 2025 నాటికి 934గా ఉండగా, తుది ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి 892కి పడిపోయింది.

దీని అర్థం 17 లక్షల మంది మహిళలు తప్పిపోయారు. ఎస్‌ఐఆర్ ఒక దశాబ్ద కాలంగా ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తిలో సాధించిన ప్రగతిని తుడిచిపెట్టింది" అని పేర్కొన్నారు. "పేరు గుర్తింపు సాఫ్ట్‌వేర్ ఆధారంగా చేసిన మా విశ్లేషణ ప్రకారం, ముసాయిదా జాబితా నుండి మినహాయించిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 25 శాతం, తుది జాబితా నుండి తొలగించబడిన 3.66 లక్షల మంది ఓటర్లలో 34 శాతం మంది ఉన్నారని తేలింది. ఈ అసమాన మినహాయింపు దాదాపు ఆరు లక్షల మంది ముస్లిం ఓటర్ల తగ్గింపుకు దారితీసింది" అని ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. తుది జాబితాలోని కనీసం 5.17 లక్షల పేర్లు నకిలీలుగా కనిపిస్తున్నాయని ప్రశాంత్ భూషణ్ పరిశీలనపై స్పందించాలని ఇసిని ధర్మాసనం కోరింది. అనంతరం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

మారణహోమం జరుగుతోంది : గ్రెటా థన్‌బెర్గ్

- గ్రీస్ చేరుకున్న గ్రెటా బృందం

ఏథెన్స్ : స్వీడన్‌కు చెందిన పర్యావరణ, సామాజిక కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ మరో 160 మంది కార్యకర్తలతో కలిసి గ్రీస్ చేరుకున్నారు. మానవతా సాయం తీసుకుని గాజా బయలుదేరిన నౌకలు, బోట్లను దారి మధ్యలోనే అడ్డగించిన ఇజ్రాయిల్ వీరందరినీ వెనక్కి తిప్పిపంపింది. ఏథెన్స్ విమానాశ్రయం వద్ద గ్రెటా థన్‌బర్గ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ 'అక్కడ మారణహోమం జరుగుతోంది అని నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను' అని చెప్పారు. గాజాలో ఇజ్రాయిల్ సైనిక చర్యను ప్రస్తావిస్తూ 'మన అంతర్జాతీయ వ్యవస్థలు పాలస్తీనియన్లను మోసం చేశాయి. దారుణమైన యుద్ధ నేరాలను కూడా అవి నిలువరించలేకపోయాయి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తమ న్యాయపరమైన బాధ్యతలను నిర్వర్తించకపోవడం వల్లనే తాము నౌకల్లో గాజాకు సహాయ సామగ్రిని తరలించాల్సి వచ్చిందని చెప్పారు. ఏథెన్స్ చేరుకున్న 161 మందిలో 27 మంది గ్రీస్‌కు చెందిన వారు కాగా, మిగిలిన వారు పదిహేను దేశాలకు చెందిన వారు. విమానాశ్రయం వద్ద ప్రజలు పెద్ద ఎత్తున కార్యకర్తలకు స్వాగతం పలికారు. అరైవల్ బ్లాక్ వద్ద వారు ఓ భారీ పాలస్తీనా పతాకాన్ని వుంచారు. 'ఫ్రీడమ్ ఫర్ పాలస్తీనా', 'లాంగ్ లివ్ ది ఫ్లోటిల్లా' అంటూ నినాదాలు చేశారు.

చేయి చేసుకున్న ఇజ్రాయిల్ సైనికులు : రిమా హసన్

ఏథెన్స్ చేరుకున్న వారిలో యూరోపియన్ పార్లమెంటుకు చెందిన ఫ్రెంచ్-పాలస్తీనా సభ్యురాలు రిమా హసన్ కూడా ఉన్నారు. నౌకను అడ్డుకున్న ఇజ్రాయిల్ సైనికులు ఆమెపై చేయి చేసుకున్నారు. తనను వ్యానులో ఎక్కించేటప్పుడు ఇద్దరు పోలీసు అధికారులు కొట్టారని ఆమె తెలిపారు.

సవీందర్‌రెడ్డిపై సిబిఐ కార్యాచరణ చేపట్టొద్దు

- సుప్రీంకోర్టు ఆదేశం


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డిని అరెస్టు చేసిన వ్యవహారంలో సిబిఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. సవీందర్‌రెడ్డి అరెస్టుపై దాఖలైన హెబియస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వ్యక్తిగత హోదాలో దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీందర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకోర్టుకి ఎపి ప్రభుత్వ దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి, తరువాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తరువాతే సిబిఐ విచారణకు ఆదేశించిందని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు. గంజాయి కేసులో అరెస్టు చేస్తే, దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఎపి ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ధర్మాసనానికి తెలిపారు. ఇరువురి వాదనలను జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. అనంతరం ఈ కేసుపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు సిబిఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని ఆదేశించింది. ప్రతివాదులుగా ఎపి ప్రభుత్వం, డిజిపి, సిబిఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు, మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఎపి ప్రభుత్వానికి ధర్మాసనం అనుమతి ఇచ్చింది. త్వరలోనే తదుపరి విచారణ చేపడతామని విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

ట్రంప్ సుంకాలతో ఉపాధికి దెబ్బ

- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ అవసరం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాంభూపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, మచిలీపట్నం అర్బన్ (కృష్ణా జిల్లా)



'ట్రంప్ సుంకాలు-పరిశ్రమలపై ప్రభావం'పై మచిలీపట్నంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజల ఉపాధికి తీవ్ర దెబ్బ తగులుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ అవసరమని తెలిపారు. 'ట్రంప్ సుంకాలు-మోడీ మౌనం'పై శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన నిరసన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ముఖ్యవక్తగా మాట్లాడారు. ట్రంప్ విధించిన సుంకాలతో జిల్లాలోని ఫార్మా పరిశ్రమలు, అందులో పనిచేస్తున్న కార్మికులపై తీవ్ర ప్రభావం చూపనుందని తెలిపారు. ప్రధానంగా తీర ప్రాంతంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తోన్న ఆక్వా రంగం దెబ్బతింటుందన్నారు. పత్తిపై సుంకాలతో జిల్లాలో పత్తి సాగుపై ఆధారపడిన రైతులకు గిట్టుబాటు ధర దొరకని పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. జిల్లాలో మహిళలకు కాస్తోకూస్తో ఉపాధి కల్పిస్తోన్న పాడి పరిశ్రమకు కూడా నష్టం వాటిల్లనుందని తెలిపారు. ట్రంప్ సుంకాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నా మోడీ మౌనం వీడటం లేదన్నారు. మోడీ మౌనం వీడేలా చంద్రబాబు, పవన్, జగన్ ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని తులసీదాస్ ఆవిష్కరించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, ప్రజా, కార్మిక, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'ట్రంప్ సుంకాలు-పరిశ్రమలపై ప్రభావం'పై జరిగిన సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల టెర్రరిజంతో ప్రపంచ దేశాలపై ముఖ్యంగా భారత్‌పై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. అమెరికా నుండి డెయిరీ, విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండడాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆంక్షలకు తలవంచి అక్కడి విత్తనాలు దిగుమతి చేసుకుంటే మన దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలో పడనుందన్నారు. మన రాష్ట్రం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు పెంచడం పట్ల కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై ప్రత్యామ్నాయ మార్కెట్ కల్పించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కైరోలో కొనసాగుతున్న చర్చలు !

- తొలి రోజు సానుకూలం
- ఈసారైనా అడ్డంకులన్నీ తొలగిపోవాలన్న హమాస్

కైరో : గాజాలో రెండేళ్లుగా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణకాండకు ముగింపు పలికేందుకు ఉద్దేశించిన శాంతి ప్రణాళికపై ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న పరోక్ష చర్చలు మంగళవారం కూడా కొనసాగాయి. సోమవారం చర్చలు సానుకూలంగా సాగాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికను అమలు చేసేందుకు ఒప్పందం కుదిరే అవకాశాలు కన్పిస్తున్నాయని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఎర్ర సముద్రం రిసార్ట్ నగరమైన షార్మ్ ఎల్‌షేక్‌లో జరిగిన చర్చలు సానుకూలంగా ఉన్నాయని, వాటిని ఎలా కొనసాగించాలనే విషయంపై ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారని ఆ వర్గాలు వివరించాయి.

శాంతి ప్రణాళిక ఒప్పందంపై చర్చలు జరుగుతున్నందున తక్షణమే దాడులు ఆపాలని ట్రంప్ శుక్రవారం పిలుపునిచ్చినప్పటికీ గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడులు కొనసాగుతూనే వున్నాయని, బందీల విడుదల కోసం జరుగుతున్న చర్చలకు ఇది ప్రతిబంధకంగా మారుతుందని హమాస్ ప్రతినిధి బృందం మధ్యవర్తులకు తెలియజేసింది. ఈ ప్రతినిధి బృందంలో హమాస్ నేతలు ఖలీల్ అల్-హయ్యా, జాహర్ జబారిన్ కూడా ఉన్నారు. గత నెలలో ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయిల్ జరిపిన దాడి నుంచి వీరిద్దరూ తప్పించుకున్నారు. తొలి రోజు జరిగిన చర్చల్లో ఖైదీలు - బందీల మార్పిడి, కాల్పుల విరమణ, గాజాలో మానవతా సాయానికి అనుమతి వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయని ఈజిప్ట్ ప్రభుత్వంతో సంబంధమున్న అల్-ఖహేరా న్యూస్ తెలిపింది.

హమాస్ కీలక డిమాండ్లు

గాజాలో కాల్పుల విరమణే ప్రధాన లక్ష్యంగా సాగుతున్న ఈ చర్చల్లో హమాస్ తన కీలక డిమాండ్లను ప్రవేశపెట్టింది. గాజా ప్రజల ఆకాంక్షలు నెరవేరేందుకు గల అన్ని అడ్డంకులను అధిగమించాలని తాము కోరుకుంటున్నామని తెలిపింది. 'శాశ్వత, సమగ్ర కాల్పుల విరమణ వుండాలి, గాజా నుండి ఇజ్రాయిల్ బలగాలు పూర్తిగా వైదొలగాలి, ఎలాంటి ఆంక్షలు లేకుండా మానవతా సాయం అందనివ్వాలి, నిర్వాసితులందరూ తమ ఇళ్లకు చేరాలి, గాజాలో సంపూర్ణ పునర్నిర్మాణ ప్రక్రియ తక్షణమే చేపట్టాలి. దీన్ని పాలస్తీనా జాతీయులతో కూడిన సాంకేతిక నిపుణుల బృందం పర్యవేక్షించాలి. ఖైదీల మార్పిడి ఒప్పందం న్యాయబద్ధంగా వుండాలని' హమాస్ ప్రతినిధి ఫవ్జి బర్హౌమ్ చెప్పారు. నెతన్యాహు గతంలో జరిగిన చర్చలన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా చెడగొట్టారని, ప్రస్తుత చర్చలైనా ఎలాంటి అవరోధాలు లేకుండా సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

బందీల విడుదలకు ట్రంప్ ఒత్తిడి : అమెరికా

ఇజ్రాయిల్ బందీలు, పాలస్తీనా ఖైదీలను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని ట్రంప్ కూడా ఒత్తిడి తెస్తున్నారని అధ్యక్ష భవనం పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవిట్ చెప్పారు. ఒప్పందం కుదరడానికి మంచి అవకాశాలు ఉన్నాయని ట్రంప్ సోమవారం ఓవల్ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. కొన్ని విషయాలకు హమాస్ అంగీకరిస్తోందని, అది చాలా ముఖ్యమని అన్నారు.

యుద్ధానికి ముగింపు పలకాలి : గుటెరస్

ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ సోమవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెడుతూ ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికను అవకాశంగా తీసుకొని యుద్ధానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. రక్తపాతాన్ని నివారించి, శాంతికి దారి ఏర్పరచుకోవాలంటే శాశ్వత కాల్పుల విరమణ, విశ్వసనీయ రాజకీయ ప్రక్రియ అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

వైభవంగా 'పైడితల్లి' సిరిమానోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. అంతకుముందు పైడితల్లి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి పట్టువస్త్రాలను, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఘటాలు సమర్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుమార్తె, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు... అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. సిరిమానోత్సవాన్ని పలువురు ప్రముఖులు ప్రత్యక్షంగా తిలకించారు. కోట బురుజుపైనుంచి పూసపాటి అశోక్ గజపతిరాజు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయణ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు సందర్శించారు.

కూలిన బొత్స కుటుంబం కూర్చున్న వేదిక

అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వేదికపైనుంచి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, బొత్స కుటుంబ సభ్యులు కూర్చొని సిరిమానోత్సవాన్ని తిలకించారు. ఈ వేదిక ఒక్కసారిగా కుప్పకూలింది. విజయనగరం రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్‌తోపాటు ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కార్పొరేట్ల చేతిలో రూ.25 వేల కోట్ల విలువైన భూములు!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోంది. మేనకూరు సెజ్ పేరుతో 5,600 ఎకరాలను ప్రభుత్వం తీసుకుంది. ఇక్కడ అతికొద్ది భూమి మాత్రమే ఉపయోగంలో ఉంది. మిగిలిన భూమి ఖాళీగా ఉంది. శ్రీసిటీ పేరుతో 5,700 ఎకరాలు తీసుకుంది. కొన్ని జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు వచ్చినా, 70 శాతం భూములు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. కొడవలూరు మండలం రేగడచెలిక కిసాన్ సెజ్ పేరుతో 2,776 ఎకరాలు, చిల్లకూరు మండలం చింతవరంలో టెక్స్‌టైల్ పార్కు పేరుతో 2,700 ఎకరాలు, కృష్ణపట్నం పోర్టులో సెజ్ అభివృద్ధి పేరుతో ఆరు వేల ఎకరాలను ప్రభుత్వం లాక్కొంది. కొడవలూరు వద్ద మిథానీ ఉక్కు పరిశ్రమ పేరుతో 500 ఎకరాలు, వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్ర ఖనిజాల అన్వేషణ ప్రాజెక్టు పేరుతో 500 ఎకరాలను పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు ప్రభుత్వాలు కట్టబెట్టాయి. రెండు పంటలు పండే భూములను సైతం సెజ్‌ల పేరుతో పాలకులు బలవంతంగా లాక్కున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ భూముల్లో వరి పండిస్తే ఎకరానికి మూడు పుట్లు దిగుబడి వస్తుంది. రెండు సీజన్లలో కలిసి ప్రస్తుత ధరకు అనుగుణంగా ఎకరానికి ఆరు పుట్లు ఉత్పత్తి వస్తే, రూ.1.18 లక్షల ఆదాయం వచ్చేది. ఏడాదికి మూడు లక్షల పుట్ల ధాన్యం ఉత్పత్తి నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం ఏడాదికి రూ.593 కోట్లు విలువైన పంట వచ్చేంది. ఈ లెక్కన 18 సంవత్సరాల కాలంలో సుమారు 10 వేల కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తులు ఆగిపోయాయి. రైతుల కళ్ల ఎదుట భూములు బీడుగా ఉన్నాయి. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం చేసిన విధ్వంసంగా దీనిని వారు పరిగణిస్తున్నారు. ఖాళీగా ఉన్న తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు.

దేశ భద్రత పణం!

(మొదటిపేజీ తరువాయి)

జరిగాయా, లేదా అనే దానిపై అదాని సంస్థ స్పష్టతను ఇవ్వలేదు. కస్టమ్స్ డేటా ప్రకారం.. అదానీ డిఫెన్స్ గత సంవత్సరం రష్యా నుండి 32 మిలియన్ డాలర్ల విలువైన క్షిపణి భాగాలను దిగుమతి చేసింది. 2024 జనవరి నుండి రష్యా, ఇజ్రాయెల్, కెనడా నుండి రక్షణ సంబంధిత దిగుమతులు మొత్తం 70 మిలియన్లకు చేరాయి. సెప్టెంబర్ 2025లో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నియమాల ప్రకారం.. అన్ని క్షిపణి భాగాలపై సుంకం మినహాయింపును ఇచ్చారు. అయితే గతంలో షార్ట్ రేంజ్ క్షిపణి భాగాలకు ఈ మినహాయింపు వర్తించలేదని అధికారులు స్పష్టం చేశారు. అదానీ గ్రూపునకు ఇలాంటివి కొత్తేమి కాదు. అదానీ గ్రూప్ ఇటీవల రెండు స్టాక్ (షేర్ల) మోసాల ఆరోపణల కేసులలో భారత మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నుండి క్లియరెన్స్ పొందినప్పటికీ.. సెక్యూరిటీస్ నిబంధనలకు సంబంధించి డజనుకు పైగా ఇతర విచారణలను ఎదుర్కొంటోంది. 2014 నుండి బొగ్గు దిగుమతులపై ఓవర్ ఇన్‌వాయిసింగ్ ఆరోపణలపై రెవెన్యూ డిపార్ట్‌మెంట్ విచారిస్తోంది.

నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నాలుగు రాష్ట్రాల్లో నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం జరిగింది. మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని 18 జిల్లాల పరిధిలో నాలుగు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు వల్ల దాదాపు 894 కిలో మీటర్ల రైల్వే నెట్‌వర్క్ పెరుగుతుందని పేర్కొంది. 2030-31 నాటికల్లా పూర్తవనున్న ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 24,634 కోట్లుగా తెలిపింది. మహారాష్ట్రలోని వార్ధా - భూసావాల్ - మూడు, నాలుగు లైన్ - 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో గోండియా - డోంగర్‌గఢ్ - నాలుగో లైన్ - 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో వడోదర - రత్లాం - మూడో, నాలుగో లైన్ - 259 కిలోమీటర్లు, మధ్యప్రదేశ్‌లో ఇటార్సీ - భోపాల్ - బీనా నాలుగో లైన్ -237 కిలోమీటర్లు నిర్మిస్తారు.

నాసిరకం, నకిలీ మందులపై తక్షణ చర్యలు

- ప్రజారోగ్య వేదిక డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో నాసిరకం, నకిలీ మందుల సమస్య పరిష్కరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రికి, వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.వి రమణయ్య, టి.కామేశ్వరరావులు మంగళవారం లేఖ రాశారు. డైయిథిలిన్ గ్లైకాల్ (డిఇజి)తో కలుషితమైన దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇటీవల 12 మంది చిన్న పిల్లలు మృతి చెందడం భాదాకరమని లేఖలో పేర్కొన్నారు. రోగుల ప్రాణాలను కాపాడటానికి, దేశ ఔషధ నియంత్రణ చట్టాన్ని బలోపేతం చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పటానికి ఈ ఘటనే ఉదాహరణగా వెల్లడించారు. జనరిక్ మందుల తయారీలో అగ్రగామిగా ఉన్న భారత దేశం ఈ నాసిరకం, ఔషదాల కారణంగా ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని తెలిపారు. కేంద్ర ఔషద నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) వెల్లడించిన వివరాల ప్రకారం ప్రతి ఏటా పరీక్షించే నమూనాలలో 3 నుంచి 4 శాతం మందులలో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని, మందుకు పనిచేసేశక్తి తగ్గిపోవడంతో చికిత్స ఫలితాలు సరిగా లేకపోవడం వంటి పరిణామాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'సులభతర వాణిజ్యం' విధానం ఔషద నాణ్యత, నియంత్రణను బలహీనపరిచినట్లు భావిస్తున్నామన్నారు. తయారీదారుల స్వీయ ధృవీకరణపై ఆధారపడటం, సరిపోని తనిఖీలతో నాసిరకం, నకిలీ మందులు విస్తరించడానికి దారితీస్తున్నాయని వెల్లడించారు. రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నియంత్రణ చట్టాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఇటువంటి చర్యలకు పాల్పడే సంస్థలపై రీకాల్ విధానాలు, అధిక జరిమానాలు, వేగవంతమైన విచారణ జరపడానికి చట్టాన్ని సవరించాలని కోరారు. ఔషద నియంత్రణ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. పర్యవేక్షణ సామర్థ్యం పెంచడానికి, నాణ్యత నియంత్రణ అధికారుల సంఖ్య, పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచాలని సూచించారు. అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇప్పుడు ఆచరిస్తున్న తయారీదారుల స్వీయ ధృవీకరణ జవాబుదారీ తనాన్ని దెబ్బతీస్తుందన్నారు. వ్యాపార సౌలభ్యంకోసం రోగి భద్రత విషయంలో రాజీ లేకుండా సడలించిన సమ్మతి నిబంధనల కంటే కఠినమైన స్వతంత్ర తనిఖీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సరఫరా గొలుసు పర్యవేక్షణ మెరుగు పరచాలన్నారు. ఔషధ ప్రామాణికతను ధృవీకరించడంపై పౌరులకు అవగాహన కల్పించడానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని లేఖలో పేర్కొన్నారు.

జీవన సారథం
విద్య, వివేకం, పరిజ్ఞానం ఉపయోగించిన కొద్దీ వృద్ధిచెందుతూనే ఉంటాయి.

మీకోసం
అల్లంతో చేసిన టీని వేడిగా తాగడం వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.



తెలివైన కొండ గొర్రె




అడవి పక్క అనంతసాగర్ అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో మల్లయ్య అనే గొర్రెల కాపరి ఉన్నాడు. అతనికి గొర్రెల మంద ఉంది. ఒకసారి మల్లయ్య గొర్రెల మందను అడవికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ ఒక కొండగొర్రె పిల్ల దొరికింది. దాన్ని పట్టుకొని ఇంటికి తీసుకొచ్చాడు. రోజు దానికి తుమ్మకొమ్మ, పచ్చిగడ్డి మేత వేసి పెంచాడు. అది చాలా తెలివిగలది.

ఒకరోజు మల్లయ్య తన గొర్రెల మందను తోలుకొని ఊరు పక్కన ఉన్న అడవిలోకి వెళ్ళాడు. గొర్రెలు గడ్డిమేస్తున్నాయని మల్లయ్య కాసేపు చెట్టు కింద నిద్రపోయాడు. అప్పుడు అవి మేస్తూ, మేస్తూ దూరంగా అడవిలోకి వెళ్ళాయి.

ఒక పాడుబడ్డ చిన్నబావి మీద వేటగాడు అడవి జంతువుల కోసం దుప్పటి కప్పి దుంపలు పోశాడు. ఈ గొర్రెలు దుంపలను చూశాయి. అందరం కలిసి మనం ఈ ఆహారాన్ని తిందాము అనుకున్నాయి. మెల్లగా దుప్పటి దగ్గరకు వెళ్లాయి. కొండగొర్రె ఈ విషయాన్ని గమనించింది. 'అక్కడికి వెళ్ళకండ'ని చెప్పింది. కానీ మిగతా గొర్రెలు వినిపించుకోలేదు. దుంపలను తిందామని ముందుకెళ్లాయి. బావిలో పడ్డాయి. 'కాపాడండీ! కాపాడండీ' అని గట్టిగా అరిచాయి. వెంటనే కొండగొర్రె కొన్ని ఎండిన కట్టెలను, గడ్డిని తీసుకువచ్చి బావిలో వేసింది. గొర్రెలు బావిలోంచి మెల్లగా బయటకు వచ్చాయి. వాటి అరుపులు విని మల్లయ్య లేచి అక్కడకు వచ్చాడు. గొర్రెలన్నీ కొండగొర్రెని ప్రేమగా తాకడం చూశాడు. ఏదో ఆపద నుండి అది రక్షించిందని మల్లయ్యకి అర్థమైంది. అప్పటి నుండి గొర్రెలన్నీ కొండగొర్రెతో స్నేహం చేశాయి.



– జక్కుల శరణ్య
7వ, తరగతి , బక్రిచెప్యాల , సిద్ధిపేట.




కనిపెట్టండి చూద్దాం

పిల్లలూ, ఇక్కడ వృత్తాలలో వేసిన అంకెలతో ఒక తమాషా లెక్క ఇచ్చాం. దాన్ని బాగా పరిశీలించి ప్రశ్నార్థకం ఉన్న వృత్తంలో సరైన అంకె వేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



వడ్డి వర్షిత,
9వ తరగతి,
రాక్ ఇంగ్లీష్ మీడియం
హై స్కూల్,
కొత్తూరు, నెల్లూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ దంతాలను రక్షించుకోండి...

దంతాలను, చిగుళ్లను అన్ని వైపులా శుభ్రంచేసుకోక పోవడం వల్ల నోటి దుర్వాసన వస్తుంది. దంతాలు వచ్చినా, రాకపోయినా శిశువులు పాలు తాగిన తర్వాత నోరంతా శుభ్రంగా కడగాలి. వేలితో చిగుళ్లను మర్దన చేయాలి. పాల సీసా పీకను నోట్లోనే ఉంచి నిద్రపుచ్చకూడదు. ఏదైనా తిన్న తర్వాత పుక్కిలించి ఊయడం, నోటిని శుభ్రంగా కడుక్కోవడం వంటి పనులను పిల్లలకు అలవాటు చేయాలి. పిల్లలకు దంతాలు ఎలా తోమాలో తల్లిదండ్రులే దగ్గరుండి నేర్పించాలి. మనం తిన్న ఆహారం పండ్లలో ఇరుక్కుపోయి కుళ్లిపోయి దంత సమస్యలు వస్తాయి. అందుకే చిగుళ్లు వాయడం, రక్తంకారడం జరుగుతుంది. పళ్లు పుచ్చిపోవడం మరో సమస్య. పుచ్చడం ప్రారంభంలోనే గుర్తించి చికిత్స చేయించుకోవాలి. మధుమేహం ఉన్నవారు దంతాల సంరక్షణ విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే మరింత ప్రమాదం. పండ్లు పుచ్చిపోవడానికి అసలు కారణం సూక్ష్మజీవులే. కాబట్టి దంత సంరక్షణలో అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చు. కొందరు కిళ్లీ, వక్కల వంటివీ నములుతుంటారు. ఇవి దంత సమస్యలు మరింత తీవ్రమయ్యేలా చేయొచ్చు.



నోటి దుర్వాసన : నోటి దుర్వాసన చికాకు పెట్టే సమస్య. నలుగురిలో ఉన్నప్పుడు ఇబ్బందికి గురిచేస్తుంది. ఇది ఎవరికైనా, ఏ వయసులోనైనా రావొచ్చు. చాలావరకూ ఇది మామూలుదే గానీ కొన్నిసార్లు ఇతరత్రా జబ్బులకూ సంకేతం కావొచ్చు. నోటి దుర్వాసనకు ప్రధాన కారణం దంతాలు, నాలుక మీద బ్యాక్టీరియా పెరగటం.



ఉదయం లేవగానే కొద్దిగా చెడు వాసన రావటం సహజమే. నోరు తెరచి నిద్రపోయేవారిలో ఇది మరింత ఎక్కువ. ఇలాంటి వారిలో నోరు ఎండిపోయి, బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి వీలు కల్పిస్తుంది. నోట్లో నివసించే బ్యాక్టీరియా గంధకంతో కూడిన రసాయన పదార్థాలను ఉత్పత్తి చేస్తుంటుంది. చాలా జిగటగా ఉండే ఇవి కుళ్లిపోయిన గుడ్డు, ఉల్లిగడ్డ మాదిరి వాసన కల్గివుంటాయి. ఇది దుర్వాసనకు దారితీస్తుంది. పళ్ల తోముకుంటే పోతుంది. ఒకవేళ పళ్ల తోముకున్నా, మౌత్‌వాష్‌తో పుక్కిలించినా వాసన పోకపోతే ఇతరత్రా సమస్యలకు సంకేతం కావొచ్చని అనుమానించాలి. పళ్ల మీద స్థావరముండే బ్యాక్టీరియా క్రమంగా పళ్ల పుచ్చిపోవటానికి, చిగుళ్లజబ్బుకు దారితీయొచ్చు. ఇవీ దుర్వాసన పుట్టుకొచ్చేలా చేయొచ్చు.

రోజుకు రెండుసార్లు బ్రషింగ్ : చిగుళ్ళ, దంతాలు, నాలుకను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలనే విషయాన్ని చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయాలి. అన్నం తినడం, నీళ్లు తాగడం ఎలాగో దంతాలను ప్రతి రోజూ రెండుసార్లు శుభ్రం చేసుకోవడం తప్పనిసరిగా పాటించేలా చూడాలి. కొందరు దంతాల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది సరికాదు. కొంత వయసు వచ్చాక పళ్లు పుచ్చిపోవడం, వాపు, చీము వచ్చి నొప్పితో బాధ పడుతుంటారు.

పళ్లు పుచ్చిపోకుండా జాగ్రత్త : ఒక్కోసారి పళ్లు జివ్వుమనటానికి ప్రధాన కారణం పళ్ల మీదుండే గట్టి పొర (ఎనామిల్) అరిగిపోవటం. ఇందుకు తెలిసో తెలియకో పళ్లను గట్టిగా బ్రష్ చేసుకోవటం..నిద్రలోనో, ఒత్తిడితోనో పళ్లు నూరటం కారణం కావొచ్చు. జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఎగదన్నుకొని రావటం.. అతిగా కూల్‌డ్రింకులు, మద్యం తాగటం వంటివీ దోహదం చేస్తుంటాయి. దంతాల మీద ఆమ్లం పేరుకుంటే ఎనామిల్‌ను చికాకు పరచి, క్షీణించేలా చేస్తుంది. కొందరికి పళ్లు పుచ్చిపోవటం, అది దంత మూలానికి విస్తరించటం.. చిగుళ్లజబ్బుతో చిగుళ్లు కిందికి జారటంతోనూ జివ్వుమనొచ్చు.

ఎనామిల్ అరిగిపోకుండా : పళ్లు నూరటం, పుచ్చిపోవటం, చిగురు కిందికి జారటం వల్ల జివ్వుమనటమనేది ఆయా దంతాలకే పరిమితమవుతుంది. బ్రషింగ్‌తో ఎనామిల్ అరిగిపోతే అటువైపున రెండు మూడు పళ్లూ జివ్వుమనొచ్చు. ఇది తగ్గటానికి చాలామంది డీసెన్సిటివ్ టూత్ పేస్టులు వాడుతుంటారు. వీటితో కొంత ఉపశమనం లభిస్తుంది గానీ సమస్య ఎనామిల్‌కు పరిమితమైనప్పుడే ఇవి పనిచేస్తాయి. పళ్లు పుచ్చిపోయినా, ఇన్‌ఫెక్షన్ వచ్చినా పెద్దగా ఉపయోగపడవు. కారణాన్ని బట్టి చికిత్స చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఎనామిల్ అరిగిపోతే ఫిల్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ ఉంటే రూట్‌కెనాల్ చికిత్స చేస్తారు.

దంత సమస్యలపై అవగాహన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వశాఖల ఆదేశాల మేరకు దంత సంరక్షణపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నోటి అల్సర్లను ముందస్తుగానే గుర్తించి చికిత్సలు చేస్తే క్యాన్సర్ వంటి పెద్ద రోగాలకు మారకుండా కాపాడుకోవచ్చు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో పుచ్చిన దంతాలను తీసేయటం (ఎక్స్ట్రాక్షన్), మరీ ముదిరిన దంతాలను తీయించివేయటం (స్కేలింగ్), పుచ్చిన పంటిని పూడ్చటం(ఫిల్లింగ్) వంటి చికిత్సలు చేస్తున్నాం. అన్ని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలతోపాటుగా పాఠశాలల్లో కూడా దంత ఆరోగ్యంపై పిల్లలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



నోటి దుర్వాసనకు కారణాలు

- ముక్కు చుట్టుపక్కల గాలిగదులు, గొంతు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లతోనూ నోరు చెడు వాసన కొట్టొచ్చు.
- మధుమేహం నియంత్రణలో లేనివారి శ్వాస పండ్లు లేదా కుళ్లిపోయిన యాపిళ్ల మాదిరి వాసన రావొచ్చు.
- తీవ్రమైన కాలేయ జబ్బుతో బాధపడేవారిలో శ్వాస చెడు వాసనతో కూడుకొని ఉండొచ్చు. లేదా వెల్లుల్లి, కుళ్లిపోయిన గుడ్ల వంటి వాసన రావొచ్చు.
- అరుదుగా అవయవాల వైఫల్యంతోనూ దుర్వాసన తలెత్తొచ్చు. కిడ్నీ విఫలమైనవారి శ్వాసలో అమ్మోనియా లేదా మూత్రం వాసనతో కూడుకొని ఉండొచ్చు.

ఇవి చేయొద్దు

- కిందిపండ్లు పైకి, పై పండు కిందికి బ్రష్ చేయాలి.
- పెద్ద వాళ్లు కూడా బ్రష్‌ని ప్రతి మూడు నెలలకోసారి మార్చాలి
- పంటి నొప్పి లేదా చిగురు వాపు వస్తే దంతానికి జండూబామ్ లేదా అమృతాంజన్ వంటివి రాయకూడదు.
- పంటి సందుల్లో పుల్లలు, పిన్నీసులు వంటివి పెట్టి కెలకకూడదు.
- పాన్, గుట్కా వంటి ఇతర పొగాకు ఉత్పత్తులను నమలకూడదు. –గరుకైన పొడులను, గట్టిగా ఉండే బ్రష్‌లను దంతాలు శుభ్రంచేయడానికి ఉపయోగించకూడదు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- మూడేళ్ల పిల్లలకు ప్రత్యేక బ్రష్‌లు, పేస్టులు మేలు
- ఎనిమిదేళ్ల వరకూ తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఒకసారి, స్వతహాగా ఒకసారి పళ్లు శుభ్రం చేసుకునేలా అలవాటు మంచిది
- ప్రతి రోజూ రెండుసార్లు కనీసం రెండు నిముషాల పాటు పళ్లను శుభ్రం చేసుకునేలా ప్రోత్సహించాలి
- దంతాలపై ఎనామిల్ పోయేలా ఎక్కువ సేపు బ్రష్ చేయకూడదు.
- ఏదైనా ఆహారం తిన్న వెంటనే తప్పనిసరిగా పుక్కిలించి ఊయాలి –అతి చల్లగా కానీ లేదా అతి వేడిగా ఉండే పదార్థాలు, పానీయాలను పంటికి తగలనీయొద్దు

-బోయిన శ్రీరంగ శ్రీనివాస్
-ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, చల్లపల్లి, కృష్ణాజిల్లా.
సెల్ : 9393912355.




సంక్రాంతికి మహేష్‌బాబు మల్టీప్లెక్స్ ప్రారంభం

కథానాయకుడు మహేష్‌బాబు, ఏషియన్ సినిమాస్‌తో కలిసి ఏఎంబీ సినిమాస్ పేరుతో గచ్చిబౌలిలో మల్టీప్లెక్స్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ భారీ మల్టీప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. ఏఎంబీ సినిమాస్–ఫేజ్2గా వస్తున్న ఈ థియేటర్ నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఈ మల్టీప్లెక్స్‌ను 2026 సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకురావటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం 7 స్క్రీన్లతో ఈ థియేటర్ రూపుదిద్దుకుంటోంది. అత్యాధునిక ప్రొజెక్షన్ టెక్నాలజీ, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్, సౌకర్యవంతమైన ప్రీమియం సీటింగ్‌తో గచ్చిబౌలి ఏఎంబీని మించిన స్థాయిలో దీనిని నిర్మిస్తున్నట్లు సమాచారం.

మిత్రమండలి ట్రైలర్ విడుదల

బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. తాజాగా మంగళవారం ఈ చిత్రం నుండి ట్రైలర్ విడుదలైంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతగా సోమరాజు పెన్మెత్స వ్యవహరిస్తున్నారు. అక్టోబర్ 16న ఈ చిత్రం విడుదల కానుంది.






శింబు 'అరసన్' ప్రారంభం

వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు మంగళవారం చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాకు 'ఆరసన్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. శింబు 49వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాత కళైపులి థాను తమ వీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో సమంత కథానాయికగా ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. అయితే.. సమంతతో పాటు కీర్తి సురేశ్, శ్రీలీలను కూడా ఈ సినిమా కోసం సంప్రదిస్తున్నట్లు సమాచరాం. 2018లో వెట్రిమారన్ డైరెక్షన్‌లో ధనుష్ హీరోగా వచ్చిన వడ చెన్నై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇకపై వెట్రిమారన్ సినిమాటిక్ యూనివర్స్‌లో వరుస చిత్రాలు రానున్నాయి.

ఆర్‌పిఎఫ్ అధికారి పాత్రలో మెప్పిస్తా : రవితేజ



"మాస్ జాతర' సినిమాలో నేను ఆర్‌పిఎఫ్ (రైల్వే పోలీస్ ఫోర్స్) అధికారి పాత్రలో నటించా. ఇది నా సినీ ప్రయాణంలో సరికొత్త, ప్రత్యేకమైన పాత్ర. చిత్ర దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో చాలా మంచి ఎఫర్ట్ పెట్టి పనిచేశారు. ఈ సినిమా పూర్తిగా వినోదం, మాస్ అంశాలతో పాటు హృదయపూర్వక కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. నా నటన సరికొత్తగా ఉంటుంది. ఈ పాత్రలో ఖచ్చితంగా ప్రేక్షకులను మెప్పిస్తాననే నమ్మకం ఉంది' అని కథానాయకుడు రవితేజ అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'మాస్ జాతర' ఈనెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తోంది. భాను భోగవరపు దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వ్యాఖ్యాత సుమతో కలిసి చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. 'రవితేజతో కలిసి నటించడం చాలా ఆనందకరమైన అనుభవం' అని నటి శ్రీలీల అన్నారు.

కబడ్డీ నేపథ్యంలో 'బల్టీ'



షేన్ నిగమ్, ప్రీతి అస్రానీ, శాంతను భాగ్య రాజ్, సెల్వరాఘవన్‌తో పాటు 'ప్రేమమ్' డైరెక్టర్ ఆల్ఫాన్స్ పుదిరన్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'బల్టీ'. ఉన్ని శివలింగం దర్శకత్వంలో తమిళ, మలయాళ భాషల్లో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగులో విడుదలవుతోంది. కబడ్డీ ఆట నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రాజకీయాలు, గ్యాంగ్‌స్టర్ కథలతో కలిపి వైవిధ్యంగా రూపొందించారు. ఈ చిత్రాన్ని తెలుగులో ఎల్మా పిక్చర్స్ సంస్థ విడుదల చేస్తోంది. 'తమిళ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ సినిమా అక్కడ ఘనవిజయం సాధించింది. తెలుగులోకి డబ్ చేసి విడుదల చేస్తున్నాం. యువ సంగీత దర్శకుడు సాయి అభయంకర్ సంగీతాన్ని అందించారు. మలయాళంలో 'ఆర్‌డిఎక్స్ సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకొని మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు షేన్ నిగమ్ ఇందులో హీరోగా అద్భుతమైన నటన కనబర్చారు. ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్ నటన ఆకట్టుకుంటుంది. దర్శకుడు సెల్వరాఘవన్ ప్రతినాయకుడి పాత్రలో అద్భుతంగా నటించారు' ఎల్మా పిక్చర్స్ సంస్థ అధినేత ఎన్.ఎథిల్‌రాజ్ వివరించారు.

ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు రేసులో అభిషేక్, కుల్దీప్, మంధాన


దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు రేసులో టీమిండియా నుంచి స్మృతి మంధాన, అభిషేక్ శర్మ, కుల్దీప్ యాదవ్ నామినేట్ అయ్యారు. సెప్టెంబర్ నెలకు గాను వీరంతా 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' నామినీలుగా ఎంపికైనట్లు ఐసిసి మంగళవారం ప్రకటించింది. ఆసియాకప్–2025లో యుఎఇపై శతకం బాదిన 25ఏళ్ల అభిషేక్.. ఓవరాల్‌గా ఈ టోర్నీలో 314పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలవడంతోపాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. అలాగే ఐసిసి రేటింగ్స్‌లో భాగంగా టి20 చరిత్రలో 931 రేటింగ్ పాయింట్లు సాధించిన తొలి ఆటగాడిగానూ రికార్డు పుటల్లోకెక్కాడు. అలాగే కుల్దీప్ యాదవ్ ఆసియాకప్‌లో 17వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. యుఎఇపై (4/7), పాకిస్తాన్‌పై (4/30)తో రాణించాడు. ఇక మహిళల విభాగంలో స్మృతి మంధాన సెప్టెంబర్ నెలకు 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు రేసులో నిలిచింది. ఆస్ట్రేలియాపై వరుసగా రెండు శతకాలు, ఒక అర్ధశతకంతో రాణించడంతో ఆమె ఈ అవార్డు రేసులో నిలిచినట్లు ఐసిసి తాజా ప్రకటనలో పేర్కొంది. గత నెలలో మంధాన ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో 77 సగటుతో 308 పరుగులు చేసింది. వీరితో పాటు జింబాబ్వేకు చెందిన బ్రియాన్ బెన్నెట్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. బెన్నెట్ గత కొంత కాలంగా టి20 క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. 21 ఏళ్ల బెన్నెట్ గత నెలలో శ్రీలంక, ఉగాండా, నమీబియా, బోట్స్వానాపై అర్ధ సెంచరీలు చేశాడు. టి20 ప్రపంచ కప్–2026 ఆఫ్రికా క్వాలిఫైయర్‌లో టాంజానియాపై కూడా బెన్నెట్ సెంచరీ సాధించాడు.



అగ్రస్థానంలోనే మంధాన

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ స్మృతి మంధాన అదరగొడుతోంది. ఐసిసి మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో మంధాన 791 పాయింట్లలో మరోసారి టాప్‌లో నిలువగా.. న్యూజిలాండ్‌పై విధ్వంసక శతకం బాదిన తంజిమ్ బ్రిస్ట్(దక్షిణాఫ్రికా) టాప్–5లోకి దూసుకొచ్చింది. ఇండోర్ స్టేడియంలో రికార్డు శతకంతో సఫారీ జట్టును గెలిపించిన బ్రిస్ట్ 706 రేటింగ్ పాయింట్లతో ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానం సొంతం చేసుకుంది. వన్డే ప్రపంచ కప్ ముందు ఆస్ట్రేలియాపై రెండు శతకాలతో మెరిసిన టీమిండియా వైస్ కెప్టెన్ వన్డే ప్రపంచకప్‌లో నిరాశపరిచినా.. ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పు చోటు చేసుకోలేదు. ఇంగ్లండ్ సారథి నాట్ సీవర్ బ్రంట్(731) రెండో ర్యాంక్ సాధించగా.. ఆసీస్ స్టార్ బ్యాటర్ బేత్ మూనీ 713 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు.. ఆస్ట్రేలియాకే చెందిన అష్ గార్డ్‌నర్ 697 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో నిలిచింది. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్(612), దీప్తి శర్మ(610పాయింట్లు) 16, 17వ స్థానాల్లో నిలిచారు. ఇక బౌలర్ల జాబితాలో టాప్‌లో ఎక్లేస్టోన్(ఇంగ్లండ్) 792రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలువగా.. ఆస్ట్రేలియాకు చెందిన గార్డినర్(692), స్కట్(666), కిమ్ గ్రాత్(663) వరుసగా టాప్–5లో చోటు దక్కించుకున్నారు. దీప్తి శర్మ(640) 6వ స్థానంలో నిలించి టాప్–10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకొంది. దీప్తి శర్మ ఆల్‌రౌండర్ల జాబితాలోనూ 390పాయింట్లతో 4వ స్థానంలో నిలిచింది.

వెస్టిండీస్ వెటరన్ క్రికెటర్ బెర్నార్డ్ జులియన్ కన్నుమూత



ట్రినిడాడ్: వెస్టిండీస్ తొలితరం క్రికెటర్, తొలి ప్రపంచకప్ గెలుపొంది న జట్టు ఆటగాడు బెర్నార్డ్ జులియన్ (75) కన్నుమూశాడు. క్లైవ్ లాయిడ్ సారథ్యంలో 1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టులో సభ్యు డైన బెర్నార్డ్ నార్తర్న్ ట్రినిడాడ్‌లో మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెటరన్ ప్లేయర్, వరల్డ్ కప్ ఛాంపియన్ అయిన బెర్నార్డ్ మృతిపట్ల కరేబియన్ జట్టు సంతాపం తెలియజేసింది. ఆల్‌రౌండర్ అయిన బెర్నార్డ్ కుడిచేతివాటం బ్యాటర్, స్పిన్నర్. వెస్టిండీస్ తరపున 1973 నుంచి 1977 మధ్య 24 టెస్టులు, 12 వన్డేలు ఆడాడు. వన్డే వరల్డ్ కప్‌లో విండీస్ విజేతగా నిలవడంలో బెర్నార్డ్ పాత్ర మరువలేనిది. శ్రీలంక, న్యూజి లాండ్‌పై నాలుగేసి వికెట్లతో చెలరేగిన అతడు ఫైనల్లో బ్యాటుతో మెరిశాడు. లార్డ్స్ మైదానంలో జరిగిన టైటిల్ పోరులో ఆస్ట్రేలి యాపై 26 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలకమయ్యాడు. 1973లో లార్డ్స్ టెస్టులో బెర్నార్డ్ చిరస్మరణీ య ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్ల వ్యూహాలను తిప్పికొడు తూ 121 పరుగులతో రాణించి జట్టును గెలిపించాడు.

ఆసీస్ కెప్టెన్‌గా మార్ష్

- స్టార్క్, షార్ట్ ఇన్.. మ్యాక్స్‌వెల్, కమిన్స్ ఔట్..
- భారత్‌తో సిరీస్‌కు జట్లను ప్రకటించిన ఆస్ట్రేలియా



సిడ్నీ: భారత్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు ఆస్ట్రేలియా తమ జట్లను ప్రకటించింది. అక్టోబర్ 19 నుంచి ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ టి20, వన్డే సిరీస్‌లలో తలపడనుంది. టి20, వన్డే సిరీస్‌లలో పాల్గొనే ఆసీస్ జట్లను క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) మంగళవారం ప్రకటించింది. రెండు ఫార్మాట్‌లకు మిచెల్ మార్ష్ సారథ్యం వహించనున్నాడు. వన్డే జట్టులో స్టార్క్, షార్ట్, ఓవెన్‌లు రీ ఎంట్రీ ఇచ్చారు. గ్లెన్ మాక్స్‌వెల్, పాట్ కమిన్స్‌కు చోటు దక్కలేదు. గాయాల నుంచి వీరు ఇంకా కోలుకోకపోవడమే ఇందుకు కారణం. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన టి20 సిరీస్‌లో గాయం కారణంగా దూరమైన ఓవెన్ తిరిగి జట్టులో చోటు సంపాదించుకున్నాడు. మూడు వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు జరగనుండగా.. వన్డే సిరీస్‌కు పూర్తి స్థాయిలో జట్టును ఎంపిక చేయగా, టి20 సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లకు మాత్రమే జట్లను ఎంపిక చేసినట్లు సిఏ తెలిపింది.

వన్డే జట్టు: మిచెల్ మార్ష్(కెప్టెన్), బార్ట్‌లెట్, క్యారీ, కొన్నోలీ, ద్వార్షుయిస్, ఎల్లిస్, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, ఓవెన్, రెన్షా, షార్ట్, స్టార్క్, జంపా.

టి20 జట్టు: మిచెల్ మార్ష్(కెప్టెన్), అబాట్, బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, ద్వార్షుయిస్, ఎల్లిస్, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, కుహ్నెమాన్, ఓవెన్, షార్ట్, స్టోయినిస్, జంపా.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68